


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 06-09-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 311 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## సులభతర వాణిజ్యంలో మళ్లీ ఏపీదే

# నెంబర్‌వన్






దిల్లీ: సులభతర వాణిజ్యం విభాగంలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ అగ్ర స్థానాన్ని నిలబెట్టుకొంది. రాష్ట్ర వ్యాపార సంస్క రణల కార్యాచరణ ప్రణా ళిక -2019 ర్యాంకింగ్స్‌ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం విడుదల చేశారు. ఈ జాబితాలో తెలుగు రాష్ట్రాలు తమ జోరు కొనసాగించాయి. ఏపీ వరుసగా రెండోసారి తన స్థానాన్ని పదిలం చేసు కోగా.. గతంలో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ ఈసారి మూడో స్థానానికి చేరింది.

రెండో స్థానాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ఆక్రమించింది. గతంలో 12 స్థానంలో ఉన్న యూపీ ఈసారి రెండో స్థానానికి చేరుకోవడం గమనార్హం. లాక్‌డౌన్ సందర్భంగా కేంద్రం ప్రకటించిన ఆత్మనిర్భర భారత్‌ను అమలు చేయడంలోనూ అన్నింటికన్నా ఏపీనే ముందుంది.


2019 మార్చి 31వరకు రాష్ట్రాలు అమలుచేసిన సంస్కరణలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. వాటిని మదించి ర్యాంకులు విడుదల చేసింది. దేశంలో టాప్ 10 ర్యాంకుల్లో నిలిచిన రాష్ట్రాలివే..

ఈ సందర్భంగా తొలి మూడు ర్యాంకుల్లో నిలిచిన ఏపీ, ఉత్తర్‌ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు నిర్మలా సీతారామన్ అభినందనలు తెలిపారు. పెట్టుబడులు ఆకర్షించడంలో రాష్ట్రాల మధ్య నెలకొన్న ఆరోగ్యకరమైన పోటీలో ఈ మూడు రాష్ట్రాలు ముందున్నాయని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఐదేళ్లలో అదనంగా రూ.20లక్షల కోట్ల పారిశ్రామికోత్పత్తే లక్ష్యమన్నారు. తద్వారా ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి కల్పనకు దోహదం చేస్తాయని చెప్పారు. వన్ ప్రొడక్ట్ - వన్ డిస్ట్రిక్ట్ కార్యక్రమంపై రాష్ట్రాలతో కలిసి కార్యాచరణ చేపట్టనున్నట్టు మంత్రి తెలిపారు. దేశంలోని ప్రతి జిల్లా స్వయం సమృద్ధి సాధించాలనేదే కేంద్రం లక్ష్యమన్నారు. ప్రతి జిల్లా తమ వనరుల మేరకు సొంత ఉత్పత్తులపైనే దృష్టిపెట్టాలని సూచించారు. సులభతర వాణిజ్యంలో ఐదేళ్లలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిదని

తరువాయి 2లో..

## గురువులకు వందనం

- జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర
- సీఎం జగన్ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు



అమరావతి: విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ విద్యా హక్కును అందించాలన్న తమ లక్ష్య సాధనలో ఉపాధ్యాయులే మార్గదర్శకులుగా తమ ప్రభుత్వం విశ్వసిస్తోందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా టీచర్లకు ఆయన ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భావి

తరువాయి 2లో..

## రాష్ట్రంలో పర్యాటక వాణిజ్యం అభివృద్ధికి

# మార్గదర్శకాలు జారీ

- ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలు పొందవచ్చు
- రాష్ట్రంలో పర్యాటక సేవా రంగాలకు మరింత ఊతం - ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అమరావతి : రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా పర్యాటక వాణిజ్యం (రిజిస్ట్రేషన్ మరియు సౌకర్యాలు) మార్గదర్శకాలు, 2020 ను విడుదల చేయడం జరిగిందని రాష్ట్ర పర్యాటక, క్రీడలు, యువజనాభివృద్ధి శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రణాళికలు , సులభతరమైన విధానంలో ప్రభుత్వ ఉత్తర్వుల నెం.188 తేది : 5-9-2020 ద్వారా

తరువాయి 2లో..

## దేశ భద్రతపై

# వెనకడుగు వేసేది లేదు

### దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్

**చైనా రక్షణ మంత్రితో భేటీలో భారత్ స్పష్టీకరణ**

**వివాదాల్ని శాంతియుతంగా పరిష్కరించుకుందామని ఉద్ఘాటన**



దిల్లీ: షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశం వేదికగా చైనా రక్షణ మంత్రితో జరిగిన భేటీలో సరిహద్దు వివాదాలపై భారత్ వైఖరిని మన దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ స్పష్టంగా తెలియజేసినట్లు కేంద్రం వెల్లడించింది. గత కొన్ని నెలలుగా సరిహద్దుల్లోని గల్వాన్ లోయ సహా వాస్తవాధీన రేఖ వెంట పలు ప్రాంతాల్లో జరిగిన పరిణామాలపై రాజ్‌నాథ్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. భారీ ఎత్తున దళాలను మోహరిస్తూ దూకుడుగా వ్యవహరించడాన్ని వ్యతిరేకించారు. యథాతథ పరిస్థితిని కొనసాగించాలన్న ద్వైపాక్షిక ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నారని నేరుగా ఆ దేశ రక్షణ శాఖ మంత్రికే తెలియజేశారు. పలు దఫాల చర్చల్లో కుదిరిన అవగాహనా

తరువాయి 2లో..

## భావనపాడు నిర్మించండి... సంతృప్తి ప్యాకేజి ఇవ్వండి...



శ్రీకాకుళం : భావనపాడు నిర్మించుటకు ఎటువంటి అభ్యంతరం లేదని అయితే సంతృప్తికర ప్యాకేజి ఇవ్వాలని భావనపాడు ప్రాంత ప్రజలు కోరారు. భావనపాడు, మర్రిపాడు, దేవునల్తాడ తదితర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులతో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మరియు రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్, రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి డా.సీదిరి అప్పల రాజు, జిల్లా కలెక్టర్ జె నివాస్ పాల్గొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మరియు రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్ మాట్లాడుతూ భావనపాడు పోర్టును రూ.3669.95 కోట్లతో తొలి దశ పనులకు డిపిఆర్ ఆమోదించడం జరిగిందన్నారు. భావనపాడు పోర్టుతో జిల్లా త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని అన్నారు. ముఖ్య మంత్రి మంచి ఆశయంతో, త్రికరణశుద్ధిగా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పోర్టు నిర్మాణం

తరువాయి 7లో..

## ఏపీ నెంబర్ వన్.. మంత్రి గౌతమ్ రెడ్డి హర్షం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నెంబర్ వన్ ర్యాంకు రావడంపై పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యల వల్లే టాప్ ర్యాంక్ వచ్చిందని ఆయన అన్నారు. కీలకమైన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో (సులభతర వ్యాపార నిర్వహణ) రాష్ట్రం తొలి స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి మేకపాటి శనివారమిక్కడ మాట్లాడుతూ... కరోనా దుర్భర పరిస్థితుల్లో ఎంఎస్‌ఎంఈలకు ప్రభుత్వం

తరువాయి 2లో..




## ఉచిత విద్యుత్ నగదు బదిలీతో రైతులకు మేలు

### మంత్రి బొత్స సత్యనారాయణ



తాడేపల్లి: రైతులకు మేలు చేసేందు?కే ఉచిత విద్యుత్ నగదు బదిలీ చేస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్‌ను మరింత పకడ్బందీగా ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావిస్తున్నారని తెలిపారు. ఉచిత విద్యుత్ విషయంలో తన తండ్రి ఒక అడుగు ముందుకు వేస్తే తాను రెండు అడుగులు ముందుకు వేస్తానని సీఎం జగన్ చెప్పారని ఆయన గుర్తు చేశారు. "ప్రజలకు మేలు జరుగుతుందని నగదు బదిలీ చేస్తున్నారు. కేంద్ర సంస్కరణల్లో భాగంగానే నగదు బదిలీ నిర్ణయం తీసుకున్నారు. మీటర్లు డిస్కంలు ఏర్పాటు చేస్తాయి. మీటర్లకు రైతులు ఒక పైసా కట్టనక్కరలేదు. ఉచిత విద్యుత్‌తో చంద్రబాబు ఆందోళన చెందుతున్నారు. నగదు బదిలీ కాదు ఉరి తాడు అంటున్నారు. నగదు బదిలీ గురించి 2014 ఎన్నికలకు ముందు గొప్పగా చంద్రబాబు చెప్పారు. నగదు బదిలీ పథకాన్ని లోకేష్ రూపకల్పన చేశారన్నారు. నగదు బదిలీ డబ్బు డిస్కంలకు వెళ్తుంది. రైతులు వాడడానికి, బ్యాంక్‌లు జమ చేసుకోవడానికి వీల్లేదు. నగదు జమ వలన ఎంత విద్యుత్ ఉపయోగించామో తెలుస్తోంది. నాణ్యమైన విద్యుత్ అడగడానికి అవకాశం రైతులకు ఉంటుంది. చంద్రబాబు పోరాటం వలన ఉచిత విద్యుత్ వచ్చిందని చంద్రబాబు సిగ్గు లేకుండా చెపుతున్నారని" బొత్స దుయ్యబట్టారు.

ఉచిత విద్యుత్‌కు

తరువాయి 2లో..

## సుభాష్ చంద్రబోస్ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

**- జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి**



శ్రీకాకుళం : దేశ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఎ) సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రధాన పురస్కార అవార్డులను ప్రధానం చేయనున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. సుభాష్ చంద్ర బోస్ ఆపద ప్రధాన పురస్కార అవార్డులు 2021 కొరకు పౌరుల నుండి, సంస్థల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు ఆయన చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 30 లోగా https://dmawards.ndma.gov.in వెబ్ సైట్ నందు ఆన్ లైన్ లో నమోదుచేసుకోవాలని ఆయన చెప్పారు. అర్హత కలిగిన వారందరూ ఆన్ లైన్ నందు దరఖాస్తుచేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## యూరియా కోసం దేవరాపల్లి పిఏసిఎస్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

**- ఆదివారం పంపిణీకి అధికారులు హామీ - శాంతించి టోకెన్లలతో తిరిగి వెళ్లిన రైతులు**



దేవరాపల్లి : జిల్లాలోని రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి సిహెచ్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సకాలంలో యురియా రైతులకు అందించాలని కోరుతూ దేవరాపల్లి పి ఏ సి ఎస్ కార్యాలయాన్ని రైతులు శనివారం పెద్ద ఎత్తున ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. జిల్లాలోని ఎరువులు కొరత తీవ్రంగా ఉందని రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయడంలేదని అన్నారు.

ఎకరాకు 2 బస్తాలు యూరియా అవసరం అయితే ఎన్ని ఎకరాలు ఉన్న ఆధార్ కార్డు పై ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. జిల్లాలోని కశింకోట, యస్ రాయవరం ,రాంబిల్లి, అనకాపల్లి, మునగపాక ,అచ్చుతాపురం, బుచ్చయ్యపెట ,వి మాడుగుల, చోడవరం , చీడికాడ, దేవరాపల్లి, కె కోటపాడు, మండలాల్లో ఎరువులు కొరత తీవ్రంగా ఉందని తెలిపారు.

కరోనా సమయంలో బస్తా యూరియా కోసం రోజుంతా ఎండలో పనులు మానుకోని నిలబడవలసి వస్తుందని అన్నారు. ఇలగైతే కరోనా రాదా అని ప్రశ్నించారు.ఈబాధ పడలేక రైతులు ప్రేవేటు వ్యాపారులు వద్ద అధిక ధరలకు ఎరువులు కోనుగోలుకు చేస్తున్నారని అన్నారు. అన్ని ఇంటికే పంపిస్తామని చేప్పిన ప్రభుత్వం వాలెంటేర్ వ్యవస్థను రైతు భరోసా కేంద్రాలను, సచివాలయ,ఉద్యోగులు లాంటి వారని ఎంత మంది ఉన్న రైతులు సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వ పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు.

ప్రభుత్వ వెంటనే స్పందించి రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేసారు. చివరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు కలుగజెసుకోని ఈరోజు వచ్చిన రైతులు అందరికీ టోకిన్లు ఇచ్చి ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రైతులకు యూరియా సరఫరా చేస్తామని హమి ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఏపీ నెంబర్ వన్..
## మంత్రి గౌతమ్ రెడ్డి హర్షం

తోడ్పాటునిచ్చారని పేర్కొన్నారు. పరిశ్రమలు మళ్లీ నడిచేలా ఆర్థిక తోడ్పాటు, భరోసాను ముఖ్యమంత్రి కల్పించారని ఆయన అన్నారు. పెట్టుబడిదారులు ఉన్న విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు ఇచ్చారన్నారు.

సింగిల్ డెస్క్ పోర్టల్‌లో పరిశ్రమలకు భూ కేటాయింపులతో పాటు వాణిజ్య వివాదాలకు ఈ ఫైలింగ్ సౌకర్యం ఉందని మంత్రి మేకపాటి తెలిపారు. విజయవాడ, విశాఖలో వాణిజ్య వివాదాలకు ప్రత్యేక న్యాయస్థానం, ఔషధాల విక్రయ లైసెన్స్ ఆన్‌లైన్‌లోనే పొందే సౌకర్యం ఉందన్నారు. ఏటా రెన్యువల్ చేసుకునే అవసరం లేకుండా షాపులకు మినహాయింపు, కార్మిక చట్టాల కింద సింగిల్ ఇంటిగ్రేటెడ్ రిటర్న్ దాఖలుకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రతి పరిశ్రమలో స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇస్తున్నామని అన్నారు. హిందూపురం, విజయవాడ, విశాఖ ఇండస్ట్రీయల్ పార్క్‌ల్లో వాణిజ్యవేత్తలతో పలుమార్లు ప్రభుత్వం సమావేశాలు నిర్వహించినట్లు మంత్రి మేకపాటి తెలిపారు.

## తారువ పంచాయితీ కార్యదర్శి ప్రసాద్ మృతి

**- అకాల మరణం పట్ల మండల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి**



దేవరాపల్లి : మండలంలోని తారువ గ్రామ పంచాయితీ కార్యదర్శి జి ఎస్ ప్రసాద్ శనివారం ఉదయం అకాల మరణం చెందారు. ఇటీవల కొంత అస్వస్థతకు గురయిన ప్రసాద్, ప్రస్తుతం విశాఖపట్నం లోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ సమాచారం తెలుసుకున్న మండల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు . యువకుడు, ఉత్సహవంతుడైన ప్రసాద్ మరణం తీరని లోటని తోటి ఉద్యోగులు విచారం వ్యక్తం చేశారు. ప్రసాద్ మరణం పట్ల ప్రభుత్వ విప్ బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైసీపీ మండల యువజన విభాగం అధ్యక్షులు బూరె బాబురావు, ఎంపీడీఓ సి హెచ్ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

## అభ్యర్థులు కావలెను

శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు నందు సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ మరియు జూనియర్ ల్యాబ్ టెక్నీషియన్లు గా పని చేయుటకు అభ్యర్థులు అత్యవస రముగా కావలయును. సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్కు రూ.15,000/-లు, సీనియర్ స్టాఫ్ నర్స్ రూ.15,000/-లు, జూనియర్ ల్యాబ్ టెక్నీషియన్కు రూ.12,000/-లు, అప్రెంటిస్ ల్యాబ్ టెక్నీషియన్కు రూ.8,000/- లు గౌరవభ్రుతి ఇవ్వబడును. ఆశక్తీగల అభ్యర్థులు దరఖాస్తుతో పాటు, సర్టిఫికేట్లు జత చేసి ఆఫీసు సమయంలునందు, శ్రీకాకుళం పట్టణం నందు బాపూజీ కళామందిర్ ఎదురుగా వున్న ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు నందు సంప్రదించవలసినదిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీకాకుళం జిల్లా చైర్మన్ ప్రి.జగన్ మోహన రావు ద్వారా తెలియజేశారు.

## నాడు - నేడు కార్యక్రమం ద్వారా
# ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు

**ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి...**

**టీచర్ పోస్టుల భర్తీకి త్వరలో మెగా డీఎస్సీ...**

**రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి..అంజాద్బాష...**



కడప : నాడు - నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి.అంజాద్బాష పేర్కొన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రి వర్యులు మున్సిపల్ హైస్కూల్ మెయిన్ లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి వర్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. నేడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మున్సిపల్ హైస్కూల్ మెయిన్ నందు ఉప ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. కుల, మత, వర్గాలకు అతీతంగా పార్టీలకతీతంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి విశేష కృషి చేశారన్నారు. నేడు ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఒక సామాన్యమైన ఉపాధ్యాయుడిగా తన జీవితాన్ని ప్రారంభించి భారత దేశానికి రాష్ట్రపతిగా ఎదిగిన మహానేతకు మనమందరం నివాళులు అర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయన మరణానంతరం ఆయన జన్మదినాన్ని ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలనే ఒక దృఢసంకల్పంతో నాడు - నేడు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పేదల అందరూ ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు విద్యకు అధిక ప్రాధాన్యతని స్తున్నారన్నారు. దీంతో సామాన్య మానవులు, రిక్షా కార్మికులు, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ప్రైవేట్ పాఠశాలలో తమ పిల్లలను చేర్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేవని ప్రైవేట్ పాఠశాలల వైపు తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నార న్నారు. ఇది గమనించి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. నాడు -నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో సుమారు 17 వందల కోట్ల కోట్ల రూపాయలు వెచ్చించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలలో టాయిలెట్స్, రన్నింగ్ వాటర్, ఫ్యాన్లు, కరెంటు, ప్రహరీ గోడ, గ్రీన్ బోర్డు, శుద్ధమైన డ్రింకింగ్ వాటర్, అన్ని సమకూర్చి మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రతి స్కూల్ క్యాంపస్ లో కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలలో నాడు -నేడు పనులు ఫైనల్ స్టేజ్ కి వచ్చాయన్నారు. సెప్టెంబర్ చివరికల్లా నాడు-నేడు పనులు పూర్తి చేయాలని స్కూల్ కమిటీ చైర్మన్, మరియు అధికారులకు సూచించడం జరిగిందన్నారు.

భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 5వ తేదీ నుంచి స్కూలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. జగనన్న విద్యా దీవెన ద్వారా అక్టోబర్ 5వ తేదీ నుంచి విద్యార్థులకు ఒక బ్యాగు, బుక్స్, మూడు జతల బట్టలు, బూట్లు., సాక్సులు, బెల్టు, క్వాలిటీ తో కూడుకున్న విద్యా సామాగ్రి విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. బట్టలకు కుట్టు కూలి కూడా ప్రభుత్వమే ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యా సామాగ్రి మొత్తాన్ని ముఖ్యమంత్రివర్యులు స్వయంగా పరిశీలించిన క్వాలిటీ మెటీరియల్ పిల్లలకు అందజేయడం జరుగుతుందన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న ఇలాంటి మంచి కార్యక్రమాలను విద్యార్థినీ, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరతతో తీర్చేందుకు త్వరలో మెగా డి ఎస్ సి నిర్వహించి 15వేల మంది టీచర్లను రిక్రూట్మెంట్ చేయడం జరుగుతుందన్నారు. డీఎస్సీ నిర్వహణకు కరోనా వల్ల కొంత జాప్యం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఒక చిత్తశుద్ధితో పేదలకు మంచి విద్యను అందించాలని ముందుకు వెళుతున్నారని ఇందుకు ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లవన్న, మున్సిపల్ హైస్కూల్ మెయిన్ ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, మరియు ఉపాధ్యాయులు, వైఎస్ఆర్సిపి నాయకులు సుభాన్ భాష, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## గురువులకు వందనం

పౌరులకు విద్య, విజ్ఞానాన్ని అందించి సరైన దిశానిర్దేశం చేయడం ద్వారా జాతి నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారని సీఎం గుర్తు చేశారు. నైతిక విలువలే పునాదులుగా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేని అన్నారు. 'గురువును దైవంగా పూజించే సంప్రదాయం భారతదేశానిది. విద్య, వివేకం, విలువలు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురువులకు వందనం' అని సీఎం వైఎస్ జగన్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

### రాష్ట్రంలో పర్యాటక వాణిజ్యం అభివృద్ధికి మార్గదర్శకాలు జారీ

మార్గదర్శకాలను జారీచేయడం జరిగిందన్నారు . ఇప్పటి వరకు రాష్ట్రంలో పర్యాటక వాణిజ్య ఆపరేటర్లు నమోదుచేసుకోవడానికి సరియైన యంత్రాంగం , విధివిధానాలు అందుబాటులో లేవన్నారు . రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా సేవా రంగాన్ని బలోపేతంచేసి స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగు తోందన్నారు . రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్ . జగన్మోహనరెడ్డి సమక్షంలో విధివిధానాలను రూపొందించే దిశలో పవర్ పాయింట్ ప్రజెంటేషను ఇవ్వడం జరిగిందన్నారు . ఆగష్టు 20 న జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి గారి ఆదేశాలతో విధివిధానాలను రూపొందించి రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి పరిచే దిశలో అడుగులు వేస్తున్నట్లు మంత్రి అవంతి శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక వాణిజ్యంపై సమగ్ర నివేదికను రూపొందించి సిఫార్సు చేయడం జరిగిందని తద్వారా టూరు ఆపరేటర్లు , అనుబంధ రంగాల వారు ప్రభుత్వం అందించే రాయితీలను , ప్రోత్సాహకాలను పొందవచ్చని మంత్రి అవంతి శ్రీనివాస్ పేర్కొన్నారు . మార్గదర్శకాలకు సంబంధించి పూర్తి వివరాలు www.aptourism.gov.in వెబ్ సైట్ లో పొందుపర్చామన్నారు . టూరు ఆపరేటర్ల , బోట్ ఆపరేటర్లు , ట్రావెల్ ఏజెంట్లు , హెరిటల్స్ , రిసార్ట్లు , మైస్ సెంటర్లు , వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్లు తదితర అనుబంధ రంగాల అపరేటర్లను రాష్ట్ర పర్యాటక శాఖతో అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు . ఇందుకోసం ఆయా సంస్థలు తప్పనిసరిగా రాష్ట్ర పర్యాటక శాఖతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తద్వారా రాయితీలను , ప్రోత్సాహాలను పొందాలన్నారు . కోవిడ్ కారణంగా మూతపడిన పర్యాటక రంగానికి వైభవాన్ని తీసుకొచ్చే దిశలో రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ చర్యలు తీసుకొంటోందని ఆయన తెలిపారు . కేంద్ర మార్గదర్శకాలు సూచనలతో విధివిధానాలను రూపొందించి ఆయా రంగాలను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు . గోవా , రాజస్థాన్ , హిమాచల ప్రదేశ్ , కేరళ , కర్నాటక వంటి రాష్ట్రాలలో పర్యాటక రంగంలో అభివృద్ధికి అమలు చేస్తున్న విధివిధానాలపై అధ్యయనం చేయడం తద్వారా రాష్ట్రంలో పర్యాటక వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు సూచనలను చేశామని , సులభతరమైన మార్గదర్శకాలను జారీచేశామన్నారు . సేవా రంగానికి పెద్దపీట వేసేందుకు నాణ్యమైన సేవలపై సూచనలు , మార్కెటింగ్ మార్గాలపై సమగ్ర నివేదిక సులభతరమైన విధానాలలో అనుమతుల మంజూరు , ఇతర రాష్ట్రాల , జాతీయ అంతర్జాతీయ పర్యాటక విభాగాలైన క్రీడలు పర్యాటక సందర్శనలు , పర్యాటక క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పర్యాటక రంగ వాణిజ్యాన్ని ఇతోధికమైన స్థానాన్ని కల్పించడం చేయాలన్నారు . ఇందుకు పర్యాటక సంబంధిత రంగాలవారిని , సంస్థల వివరాలను సేకరించాలన్నారు . పర్యాటక సేవా రంగంలో ఉన్నవారిని గుర్తించి రాష్ట్రంలో సమగ్ర పర్యాటక ప్రణాళికలు మరియు గణాంకాలను పొందుపరుస్తూ డేటాబేసు అనుగుణంగా మార్గదర్శకాలను జారీచేశామన్నారు. సెప్టెంబర్ 4వ తేదీన పురావస్తు ప్రాంతాలు, మ్యూజియం లు, రోప్ వే, బోటింగ్, అడ్వెంచర్స్ క్రీడలు, యాత్రా స్థలాల సందర్శన, తదితరులపై మార్గదర్శకాలు జారీచేశామన్నారు. బోటింగ్ పై త్వరలోనే తేదీలను ప్రకటించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి సంబంధించిన సంస్థలకు ఇది ఒక మంచి అవకాశమని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పూర్తి వివరాలకు చెల్ సైటును సందర్శించాలని టూరిజం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ్ , ఎపిటిడిసి ఎండి, ఎపిటీఏ సీఈవో ప్రవీణ్ కుమార్ తెలియజేశారు .

### సులభతర వాణిజ్యంలో మళ్లీ ఏపీదే నెంబర్‌వన్




చెప్పారు. సహకారం అందిస్తూ పోటీతత్వం పెంచడం ద్వారా పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ చర్యలతో 2025 నాటికి 5 ట్రిలియన్‌డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరతామని చెప్పారు.

నిర్మాణ రంగంలో ఆన్‌లైన్ అనుమతులు మరింత సులభతరం చేయనున్నట్టు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీ అన్నారు. నిర్మాణ రంగంలో 2057 పట్టణాల్లో ఆన్‌లైన్ అనుమతులు ఇస్తున్నట్టు తెలిపారు. సుభతర వాణిజ్యంలో 2017లో 185వ స్థానంలో ఉన్నామనీ.. 2020 నాటికి 158 స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకున్నట్టు ఆయన తెలిపారు.

### దేశ భద్రతపై వెనకడుగు వేసేది లేదు

ఒప్పందాల మేరకు పరిస్థితులు లేవని స్పష్టం చేశారు. సరిహద్దు భద్రత విషయంలో భారత సైన్యం ఎప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని రాజ్‌నాథ్ ఈ భేటీలో స్పష్టం చేశారు. అయితే, భారత సార్వభౌమత్వానికి, ప్రాదేశిక సమగ్రతకు భంగం కలిగితే ఎలాంటి చర్యకైనా వెనకడుగు వేసేది లేదని తేల్చి చెప్పారు. ఇరు దేశాధినేతల మధ్య కుదిరిన ఏకాభిప్రాయాల్ని ఉభయ పక్షాలూ అమలు చేయాలని సూచించారు. చర్చలు, సంప్రదింపుల ద్వారానే సమస్యల్ని పరిష్కరించడం కొనసాగించాలని తెలిపారు. పదే పదే ఘర్షణలకు దిగకుండా దళాలను నియంత్రించే వ్యవస్థ ను పటిష్ఠం చేయాలని కోరారు. ప్రస్తుత వివాదాల్ని వీలైనంత త్వరగా పరిష్కరించి ఇరు దేశాల మధ్య సత్సంబంధాల్ని పునరుద్ధరించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. సరిహద్దుల్లో పరిస్థితులు మరింత దిగజారే, ఉద్రిక్తంగా మారే దిశగా ఎలాంటి చర్యలకు పాల్పడొద్దని స్పష్టం చేశారు. ప్రాంతీయంగా శాంతి, సుస్థిరతను నెలకొల్పేందుకు చైనా వైపు నుంచి సహకారం కావాలని కోరారు. తమ వైపు నుంచి వస్తున్న సమస్యలు, అభ్యంతరాలను శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు కృషి చేస్తామని చైనా రక్షణ మంత్రి వెయ్ ఫెంఘె హామీ ఇచ్చినట్లు సమాచారం. మంత్రులు సహా అన్ని స్థాయిల్లో నిరంతర చర్చలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నట్లు తెలుస్తోంది.

### ఉచిత విద్యుత్ నగదు బదిలీతో రైతులకు మేలు

కాంగ్రెస్ అధిష్టానం ఒప్పుకోకపోయిన వైఎస్సార్ ఒప్పించారని, రైతులకు మేలు జరుగుతుందని అధిష్ఠానంపై పోరాటం చేసి మేనిఫెస్టోలో పెట్టారని ఆయన వివరించారు. విద్యుత్ బకాయిలు కట్టలేదని రైతులను జైల్లో పెట్టించిన ఘనత చంద్రబాబుదని ధ్వజమెత్తారు. బషీరాబాగ్‌లో రైతులను గుర్రాలతో తొక్కించి కాల్పులు జరిపించింది చంద్రబాబు కాదా.. ? విద్యుత్ ఉద్యమానికి సంబంధించి వైఎస్ రాజశేఖర్ రెడ్డి దీక్ష చేస్తే శిబిరం మీద పొగ బాంబులు వేయించలేదా..? రైతులపై ప్రేమ ఉంటే 50 రూపాయల హార్స్ పవర్‌ను ఎందుకు 650కి పెంచారు. ఉచిత విద్యుత్ ఇస్తే కరెంట్ తీగలు మీద బట్టలు వేసుకోవాలని చంద్రబాబు చెప్పలేదా.. వ్యవసాయం దండగని ఆయన మాట్లాడటం వాస్తవం కాదా.. అంటూ మంత్రి బొత్స ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన దాష్టికాలకు తానే సాక్షినని, విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేయాలని చంద్రబాబు చూశారని తెలిపారు. సోలార్ విద్యుత్ ఎక్కువ రేటుకు కమిషన్ల కోసం చంద్రబాబు కొనలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు గతం మరిచి మాట్లాడుతున్నారు. పెట్టుబడులపై సంస్కరణలపై దేశంలో రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. 'ఈజీ ఆఫ్ డూయింగ్'లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది.. దీనికి కారణం పరిశ్రమలకు ప్రోత్సాహకాలే కదా. ఈజీ ఆఫ్ డ్యూయింగ్ మొదటి స్థానం రావడానికి విద్యుత్ సంస్కరణలే కారణమని ఆయన తెలిపారు "స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నుంచి ఎంత అప్ప ఉందో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక దానికి మూడు రెట్లు అప్పు చేశారు. చంద్రబాబు ఖజానా ఖాళీ చేసి రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారు. పేదలకు మేలు చేయకూడదనేది చంద్రబాబు సిద్ధాంతం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రైతే వెన్నెముక" అని తెలిపారు. చంద్రబాబు జమిలి ఎన్నికలు రావాలని కోరుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఆయన అనుకున్నట్లు ఎన్నికలు జరగవు. రాజ్యాంగం ప్రకారం ఐదేళ్లకు ఎన్నికలు జరుగుతాయి. జమిలి ఎన్నికలు వస్తాయని చెప్పడానికి చంద్రబాబు ఏమైనా దేవ దూతనా అంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికలు జరిగితే మరో ఐదేళ్లు చంద్రబాబు ప్రతిపక్షమేనని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

### జివియంసి జోన్-4లో అద్దెకు షాపులు, కళ్యాణ మండపములు, మార్కెట్లకు

# బహిరంగ వేలం నిర్వహణ

విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ, జోన్ - 4 పరిధిలో గల 31 నుండి 49 వరకు (కొత్త వార్డ్ నం. 40 నుండి 63) వార్డులకు సంబంధించి ఖాళీగా ఉన్న షాప్ రూములు/ కళ్యాణమండపములు /రోడ్ సైడ్ మార్కెట్లు అద్దెకిచ్చుటకు జోన్-4 కార్యాలయం నందు బహిరంగవేలము తేది:11-09-2020 ఉదయం 11గం. లకు నిర్వహించబడునని నాల్గవ జోనల్ కమీషనరు పి. సింహాచలం తెలియజేసారు. తదుపరి సమాచారం కొరకు జోన్-4, జ్ఞానాపురం, జి.వి.ఎం.సి. కార్యాలయం నందు ఆఫీసు పనిదినములలో సంప్రదించ వలెను.

# బిఓఎస్ ఛైర్మన్‌గా ఆచార్య పి.విశ్వనాథం



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా విభాగ సీనియర్ ఆచార్యులు పి.విశ్వనాథం నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆచార్య విశ్వనాధంను వర్సిటీ ఆచార్యులు అభినందించారు. ప్రస్తుతం ఆచార్య విశ్వనాథం ఎంహెచ్‌ఆర్‌డి కేంద్రం సంచాలకులుగా వ్యవహరిస్తున్నారు.



*మాజీ మున్సిపల్ ఛైర్మన్, స్వర్గీయ అంధవరపు వరాహ నరసింహం వరం కుటుంబానికి పరామర్శలో డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, వైకాపా ముఖ్య నాయకులు*



*మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొండు నర్సింగరావు సతీమణి గొండు రామలక్ష్మి (80) ఇటీవల స్వర్గస్తులయ్యారు. గార మండలం అంపోలు గ్రామంలో వారింటికి వెళ్లి డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.*



*వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన, తన పినతల్లి కుమారుడైన వరదు బాబ్జిరావు ఇటీవల స్వర్గస్తులు కావడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్న డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్*

# విద్యార్థులే నిజమైన సంపద

## వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : నేటితరం విద్యార్థులే దేశానికి నిజమైన సంపదగా నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. శనివారం ఉదయం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏయూ సెనేట్ మందిరంలో వర్సిటీ ప్రిన్సిపాల్స్, డీన్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ విలువైన సేవలను అందించి, విద్యావ్యవస్థను బలోపేతం చేశారన్నారు.

విశ్వవిద్యాలయంలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. వర్సిటీలో ప్రశాంత వాతావరణం కల్పించడం, విద్యార్థులకు అత్యంత సురక్షితమైన క్యాంపస్‌గా ఏయూను తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా కొన్ని కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నామని, దీనిని అందరూ హర్షిస్తున్నారన్నారు.

**అంతర్జాతీయ ఎంబిఏ....**
**ప్రయోగ శాలల నిర్మాణం....**

ఆంధ్రవిశ్వవిద్యాలయంపై రాష్ట్ర ప్రభుత్వం సమున్నత బాధ్యతను ఉంచిందన్నారు. 2022 జాతీయ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ ఏయూ స్వీకరించాలని కోరిందన్నారు. దీనిపై త్వరలో సైన్స్ కాంగ్రెస్ అద్యక్షునికి లిఖితపూర్వకంగా కోరడం జరుగుతుదన్నారు. త్వరలో విశ్వవిద్యాలయంలో ఫుడ్ టెస్టింగ్, డ్రగ్ టెస్టింగ్, జెనిటిక్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిని పరిశ్రమలతో అనుసంధానిస్తూ పనిచేస్తామన్నారు. సమాజానికి ఉపయుక్తంగా నిలచే పరిశోధనలు జరిపే దిశగా కృషిచేస్తున్నామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ ఎంబిఏ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నామని, దీనిలో ఇప్పటికే 51 మంది విదేశీ విద్యార్థులు చేరడానికి సిద్దంగా ఉన్నారన్నారు. గడచిన రెండు నెలల కాలంలో450 మంది విదేశీ విద్యార్థులు ఏయూలో చేయడం జరిగిందన్నారు. ఆచార్యులే కీలకం...

విద్యా వ్యవస్థకు ఆచార్యులే కీలకమన్నారు. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని నింపే దిశగా ఆచార్యులు నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ, దేశ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను మలచాల్సిన అవసరం ఆచార్యులపై ఉందన్నారు. మార్పును స్వాగతిస్తూ ఆచార్యులు ముందుకు సాగాలని సూచించారు. నెలాఖరున నుంచి పరీక్షల నిర్వహిస్తామని, ఆన్‌లైన్ తగరతులను ప్రారంభిస్తామన్నారు. కోవిడ్ విపత్తును ఎదుర్కొంటూ వర్సిటీలో విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

పాలక మండలి సభ్యులు ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు దేశ నిర్మాతలుగా నిలుస్తారన్నారు. వీరికి తగిన మార్గదర్శకం చేస్తూ, ఆదర్శంగా నిలవాల్సిన బాధ్యత ఆచార్యులపై ఉందన్నారు.

వర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్, పీజీ పరీక్షల డీన్ ఆచార్య జి.వి రవీంద్ర బాబు మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయం గర్వించే అంశంగా ఉపాధ్యాయ దినోత్సవం నిలుస్తుందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ ఏయూలో పనిచేయడం అందిరికీ గర్వకారణమన్నారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, ఆచార్య కె.వి రమణ మూర్తి, ఆచార్య పి.రాజేంద్ర కర్మాకర్, ఆచార్య ఎస్.కె భట్టి, పాలక మండలి సభ్యురాలు ఆచార్య క్రిష్ణమంజరి పవార్, ప్రవేశాల సంచాలకులు ఆచార్య నాయుడు, సెక్యూరిటీ డీన్ ఆచార్య ఎన్.సత్యనారాయణ, ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య కె.విశ్వేశ్వర రావు, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్ ధనుజయ రావు, ఆచార్య మధుసూధన్, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఆళ్ల' ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం

### ముఖ్య అతిధిగా జోనల్ కమిషనర్ శ్రీరామమూర్తి



అనకాపల్లి : వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు ఆద్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జీవిఎంసీ జోనల్ కమీషనర్ శ్రీరామమూర్తి హాజరయ్యారు. ముందుగా సర్వే పల్లి రాధా కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత ఎర్రా చక్రవర్తి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత కొణతాల ఫణిభూషన శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహిత కృష్ణం రాజులను సత్కరించారు. షీల్డు అందజేసారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొడ్డేడ అప్పారావు, గైపూరి రాజు, పెతకంశెట్టి గోపీ, దాడి గణేష్, బుద్దనారాయణరావు, దొడ్డి హరి, శ్రీను, దాడి నాయుడు, మళ్ల రామచంద్రరావు, బుద్ద జగన్, బల్లా నిఖిల్, ఆళ్ల నాగేశ్వరరావు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్, ప్రొఫెసర్ సమస్యలను

# ప్రభుత్వం పరిష్కరించాలి

## - యూనియన్ అధ్యక్షులు బి.రమణ



**విలేకరులతో మాట్లాడుతున్న ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్ చోడవరం నియోజకవర్గ యూనియన్ అధ్యక్షులు బి రమణ**

చోడవరం : కరోనా కారణంగా గత ఆరు నెలలుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్ సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని పోలవరం నియోజకవర్గ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి. రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు టీచర్, లెక్చరర్స్, ప్రొఫెసర్ చోడవరం నియోజక వర్గ యూనియన్ అధ్యక్షులుగా రమణ శనివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కరోనా వచ్చిన నాటి నుండి ప్రైవేట్ టీచర్స్ పరిస్థితి మరింత దారుణంగా మారిందని వాపోయారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ టీచర్స్ ని కనీసం గుర్తించడం లేదని, ఆయా పాఠశాలల కళాశాల యాజమాన్యాల నుంచి గాని, ప్రభుత్వం నుండి గాని ఎలాంటి సహాయ సహకారాలు అందకపోవడంతో చాలాచోట్ల ఉపాధ్యాయులు కూలి పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తక్షణం ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

### జోన్ -4 కమిషనర్ కి

# అభినందనల వెల్లువ




కంచరపాలెం : జీవీఎంసీ జోన్ -4 కమీషనర్ విదులు నిర్వహిస్తున్న పొందూరు సింహాచలం కి ఇటివలే గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి లబించడంతో అబినందనలు వెల్లువెత్తుతున్నాయి. అటు జీవీఎంసీ ఉద్యోగులతోపాటుగా ఇటు వివిద రాజకీయా పార్టీ నాయకులు , పలువురు ఆసోషియేషన్ సభ్యులు సైతం ఆయనకు అబినందనలు తెలుపుతున్నారు .

ఈమేరకు వైసీపీ 57 వ వార్డు కార్పోరేటర్ అభ్యర్థిని ముర్రువాణి నానాజీ జ్ఞానపురం జోన్ -4 కార్యలయంలో శనివారం జోనల్ కమిషనర్ సింహాచలాన్ని మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్చాలతో అభినందనలు తెలియజేసారు . ఈసందర్బంగా ముర్రువాణి నానాజీ మాట్లడుతూ కరోనా సమయంలో వార్డులో చురుగ్గా పర్యటిస్తూ అన్ని విభాగాల వారిని సమన్వయపరుస్తూ వ్యాధి నివారణకు ఆయన చర్యలు తీసుకున్న చర్యలు అబినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గున్నారు.

## గురువులతో నవసమాజ ప్రగతి

# ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు



విశాఖపట్నం : ప్రపంచంలో గురుశిష్య సాంప్రదాయం మానవ జాతికి శ్రీరామ రక్ష అని పలువురు ఉపాధ్యా యులు కొనియాడారు. శనివారం ఇక్కడ ఆంధ్ర యూనివర్సిటీ సైకాలజీ విభాగం విద్యార్థుల ఆద్వర్యంలో గురుపూజత్సోవ వేడుకలను ఘనంగా నిర్వహించరు. ఈ సందర్భంగా తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఆచార్యులు పూలమాలలు వేసి తదుపరి విద్యార్థులు గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమలో ఎయు సైకాలజీ విభాగాధిపతి సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవిఆర్ రాజు మాట్లాడుతూ గురువు లతోనే నవసమాజ ప్రగతి సాధ్యం అన్నారు. విద్యతో పాటు విజ్ఞానాన్ని కూడా అందించే వారు ఒక్క గురువులేనన్నారు. నిరంతరం ఏదో ఒకటి తాము నేర్చుకుంటూ తమ విద్యార్థులకు కూడా తెలియచేయాలని మంచి సంకల్పం ఒక్క గురువులకు మాత్రమే సొంతమన్నారు. నేటి ఆధునిక యుగంలో కూడా గురువుల జ్ఞానమార్గం ఎంతో మందికి ఆదర్శనీయం అన్నారు. ప్రపంచాన్ని నడిపించేది గురుమార్గం ఒక్కటేనన్నారు. ఆంధ్రయూనివర్సిటీ లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన సేవలు మరుపురానివన్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన సర్వేపల్లి పట్టుదలతో ఉన్నత విద్యాభ్యాసం సాగించి ఎంతో మందికి ఆదర్శనీయంగా నిలచారు అని కొనియాడారు. ఆంధ్రయూనివర్సిటీలో సమర్థవంతంగా సేవలందించిన సర్వేపల్లి అ తర్వాత భారతదేశంలో ఎన్నో కీలకమైన పదవులు ఆదిరోహించారన్నారు. ప్రస్తుతం తెలుగును కొనసాగిస్తూనే మరోవైపు ఇంగ్లీషుపై కూడా ప్రతి ఒక్కరు పట్టు సాధించాల్సిన అవసరం వుందన్నారు. చిరుప్రాయం నుంచి ఇంగ్లీషు కూడా అలవాటు చేసుకుంటే అది భవిష్యత్ తరాలకు పునాది వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ సునీత, సుభాషిని తదితరులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఎయు సైకాలజీ సీనియర్ విభాగం విద్యార్థి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి , వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో వేణు, కృష్ణ, దివిజ, కిరణ్ పలువురు విద్యార్థులు పాల్గోన్నారు.

# విజయభాను సంపాదకీయం

## కష్టం నేర్పిన క్రమశిక్షణ

'మేధో చర్చలు లేదా, హేతుబద్ధత ద్వారా క్రమశిక్షణ రాదు. కష్టకాలంలో మాత్రమే అది అలవడుతుంది' అన్నాడు మహాత్మా గాంధీ. 'స్వాతంత్ర్యం అంటే స్వీయ క్రమశిక్షణ పాటించడం, స్వచ్ఛందంగా చట్టబద్ధ పాలనను ఆమోదించడం' అని కూడా గాంధీ బోధించాడు. 'కరోనా కష్టకాలం'లో వినాయక చవితి పండుగను అత్యంత క్రమశిక్షణతో జరుపుకున్నందుకు తెలంగాణ ప్రజలు అభినందనీయులు. కరోనా సందర్భంగా సామూహిక కార్యక్రమాలు చేపట్టవద్దని, ఇళ్ళలోనే జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి ప్రజలు సానుకూలంగా స్పందించారు, స్వచ్ఛందంగా అమలు చేశారు. ఇది తెలంగాణ సమాజం మనో నిబ్బరతనే కాదు, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ద్వైదీభావన లేదనే వాస్తవాన్ని కూడా ఎత్తి చూపుతున్నది.

గణేశ నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే చాలు భాగ్యనగరంతో సహా తెలంగాణవ్యాప్తంగా ఎంత కోలాహలం ఉంటుంది! ప్రత్యేకించి యువకులు, పిల్లలు సమష్టిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటారు. కానీ ఈ వినాయక చవితినాడు కాలనీలలోనే కాదు, అపార్ట్‌మెంట్‌లలో కూడా పిల్లలు గుమిగూడకుండా జాగ్రత్తలు పాటించారు. స్వాతంత్ర్య సమరంలో ప్రజలలో సమష్టి స్ఫూర్తి రగిలించి కదలిక తేవడానికి గణేశ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్రలో ప్రారంభమైన ఈ ఉత్సవాలను అతి సులభంగా తెలంగాణ సమాజం స్వీకరించడానికి కారణం ఇక్కడి ప్రజల స్వభావమే. బతుకమ్మ, దసరా వంటి ఏ పండుగనైనా సామూహికంగా జరుపుకోవడం తెలంగాణ ప్రజల అలవాటు. పండుగల సందర్భంగా ఫలహారాలు ఇచ్చిపుచ్చుకుంటారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొంటారు. కలివిడి సంస్కృతి ఇంత బలంగా నాటుకుపోయిన సమాజం ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితిని అర్థం చేసుకొని నిబ్బరంగా ఇంటికే పరిమితమై పండుగ జరుపుకోవడం విశేషమే.

సంస్కృతీ సంప్రదాయాలు నెలకొనడం వెనుక సమాజ అవసరాలు, హేతుబద్ధత ఉంటాయనే అవగాహన ఉన్నప్పుడు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవాలనే స్పృహ కూడా ఏర్పడుతుంది. కరోనా ఇంకా మనలను వెంటాడుతూనే ఉన్నది. మనం అవలంబించే స్వీయ క్రమశిక్షణే కరోనాను అంతం చేయగల ఏకైక ఆయుధం. ప్రజలు ఇదే రీతిలో క్రమశిక్షణను పాటిస్తూ ఉంటే కరోనా జాడ లేకుండా పోతుంది.

బతుకమ్మ, దసరా పండుగలు ఎంతో దూరంలో లేవు. తెలంగాణ సమాజమంతా నియమబద్ధంగా ఉండి అతి తొందరగా కరోనా వైరస్‌ను నిర్మూలిద్దామంటూ దీక్ష బూనాలి. బతుకమ్మ, దసరా, దీపావళి మొదలుకొని పండగలన్నీ మళ్ళీ సామూహికంగా మరింత సంబరంగా జరుపుకొనే మంచి రోజులు త్వరలోనే వస్తాయని ఆశిద్దాం.

## దిల్లీలో కరోనా ఉద్ధృతికి కారణం అదే : కేజ్రీవాల్

దిల్లీ: దేశ రాజధాని నగరంలో కరోనా వైరస్ ఉద్ధృతి తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతుండటంపై సీఎం కేజ్రీవాల్ స్పందించారు. కరోనా టెస్టులు పెంచడం వల్లే పాజిటివ్ కేసులు అధికంగా వస్తున్నాయన్నారు. ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "కరోనాపై దిల్లీ యుద్ధం ప్రకటించింది. ఇందులో భాగంగా పరీక్షలను రెట్టింపు చేయడం, మార్కెట్లు, బస్టాండ్లు, మొహల్లా క్లీనిక్స్ తదితర చోట్ల టెస్టులు ప్రారంభించాం. విస్తృతంగా పరీక్షలు చేసి వైరస్ సోకినవారిని ఐసోలేషన్ చేసి వారికి మంచి చికిత్స అందిస్తున్నాం. ఈ క్రమంలో కేసులు పెరిగితే భయపడొద్దని అధికారులతో చెప్పా. కరోనాతో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కరోనా మరణాలను తగ్గించేందుకు అనేక చర్యలు తీసుకున్నాం. టెస్టుల సంఖ్యను 20వేల నుంచి 40వేలకు పెంచాం. దిల్లీలోని ఆస్పత్రుల్లో పడకలకు కొరత లేదు. 14వేల పడకలు అందుబాటులో ఉండగా.. వాటిలో 5వేల పడకలు మాత్రమే వినియోగిస్తున్నాం. ఈ 5వేల పడకల్లో కూడా 1700 పడకలు దిల్లీ బయటి నుంచి వచ్చిన రోగులకే ఇచ్చాం" అని వివరించారు. మరోవైపు, నిన్న ఒక్కరోజే దిల్లీలో 36,219 పరీక్షలు చేయగా 2914 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 69 రోజుల తర్వాత తొలిసారి రికార్డుస్థాయిలో ఇన్ని కేసులు వచ్చాయి. దిల్లీలో ఇప్పటివరకు 17,05,571 శాంపిల్స్‌ను పరీక్షించగా.. 1,85,220 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

### పదోతరగతి పాఠ్యాంశంలో ఎన్టీఆర్ చరిత్ర..

# కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాలయ్య



హైదరాబాద్ : భారతదేశం గర్వించే నటుడు , మంచి సంఘ సంస్కర్త , గొప్ప రాజకీయ నాయకునిగా పేదప్రజలకు విశిష్ట సేవాలందించటమే కాకుండా తెలుగువాడి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన నట సార్వభౌముడు నందమూరి తారకరామారావు. ఎన్టీఆర్ గురించి 10వ తరగతి పాఠ్యాంశంగా చేర్చినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపిన నందమూరి బాలకృష్ణ. కళకి, కళాకారులకి విలువను పెంచిన కథానాయకుడు, తెలుగోడి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పీఠాన్ని కదలించేలా వినిపించిన మహానాయకుడు, ఎన్నో సాహసోపేతమైన ప్రజారంజక నిర్ణయాలతో ప్రజల ముంగిటకే ప్రభుత్వాన్ని తెచ్చిన ప్రజానాయకుడు, మదరాసీయులమనే పేరుని చెరిపి భారతదేశపటంలో తెలుగువాడికి, తెలుగు వేడికి ఒక ప్రత్యేకతని తెచ్చిన తెలుగుజాతి ముద్దు బిడ్డ ,అన్నగారు, మా నాన్నగారు నందమూరి తారక రామారావు గారి గురించి భావి తరాలకి స్ఫూర్తినిచ్చేలా 10వ తరగతి సాంఘిక శాస్త్ర పుస్తకం లో పాఠ్యాంశముగా చేర్చిన తెలంగాణా ప్రభుత్వానికి మరియు తెలంగాణ ముఖ్య మంత్రి వర్యులు కేసీఆర్‌కి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. అని బాలకృష్ణ తన ఫేస్ బుక్ లో తెలిపారు.

నందమూరి తారక రామారావు గారి జీవిత చరిత్ర తెలంగాణ ప్రభుత్వం పదో తరగతి పుస్తకం లో పెట్టినందుకు ధన్యవాదాలు ఇప్పటి పిల్లలకు కు ఎన్టీ రామారావు అంటే ఒక సినిమా హీరోగానే తెలుసు కానీ ఆయన ఎన్ని కష్టాలు పడి వచ్చాడు తెలియదు ఈ పుస్తకాల ద్వారా ఆయన గురించి గెలుచుకునే అదృష్టం ప్రసాదించిన తెలంగాణ ప్రభుత్వా నికి హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ నెటిజన్స్ ట్వీట్ చేశారు.

# ఆధునిక టెక్నాలజీతో పెట్రోల్ బంకుల్లో మోసాలు

**- లీటర్ పెట్రోల్‌కు 970 మి.లీ. మాత్రమే వస్తోంది - తెలంగాణలో 11, ఏపీలో 22 బంక్‌లు సీజ్**

**- 14 చిప్‌లు, 8 డిస్‌ప్లే బోర్డులు స్వాధీనం - ఒక్కో చిప్ అమర్చినందుకు లక్షా 20 వేలు వసూలు**

**వెల్లడించిన సైబరాబాద్ సీపీ సజ్జనార్**



హైదరాబాద్ : ఆధునిక టెక్నాలజీతో పెట్రోల్ బంకుల్లో వాహనదారులను మోసం చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు సైబరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. పెట్రోల్ బంకుల్లోని పంపుల్లో ఇంటిగ్రేటెడ్ చిప్‌లు అమర్చి మోసం చేస్తున్నారు. లీటర్ పెట్రోల్ పోయించుకుంటే 970 మి.లీ. మాత్రమే వస్తోందని తెలిపారు. వాహనదారుల ఫిర్యాదుతో తూనికల కొలతల శాఖ అధికారులతో కలిసి వరుసగా దాడులు చేశామన్నారు. వరుసగా దాడులు చేయడంతో మోసం వెలుగులోకి వచ్చిందన్నారు. తెలంగాణలో 11, ఏపీలో 22 పెట్రోల్ బంక్‌లు సీజ్ చేశామన్నారు. ఏడాది నుంచి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు. రూ. కోట్లలో మోసాలకు పాల్పడినట్లు సీపీ పేర్కొన్నారు. తెలంగాణలో చిప్‌లు అమర్చిన నలుగురితో పాటు 9 పెట్రోల్ బంకుల యజమానులను అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 14 చిప్‌లు, 8 డిస్‌ప్లే బోర్డులు, మదర్ బోర్డుతో పాటు కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణలో 11 పెట్రోల్ బంకుల్లో 13 చిప్‌లు అమర్చినట్లు సజ్జనార్ పేర్కొన్నారు.

సుభాని బాషా ప్రధాన నిందితుడు

చిప్‌లు అమర్చడంతో సుభాని బాషా ప్రధాన నిందితుడు అని సీపీ స్పష్టం చేశారు. ముంబైకి చెందిన వారితో కలిసి సాంకేతిక పరిజ్ఞానంతో చిప్‌లు తయారు చేశారు. పెట్రోల్ పోసే బాక్సుల్లో చిప్‌లు అమర్చి మోసం చేస్తున్నారు. డిస్‌ప్లేలో ఒక చిప్, లోపల మరో చిప్ అమర్చి మోసం చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఒక చిప్ అమర్చినందుకు రూ. 80 వేల నుంచి రూ. లక్షా 20 వేల వరకు తీసుకుంటున్నారు.

అధికారులు వచ్చినప్పుడు విద్యుత్ సరఫరాను నిలిపేసేవారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల ఒరిజినల్ సిస్టంకు వెళ్లిపోతోంది. ఈ విధంగా చిప్‌లు ఏర్పాటు చేసి అధికారులకు దొరక్కకుండా జాగ్రత్త పడేవారు. పెట్రోల్ బంకుల్లో రెండు పంపులు పెడుతారు. క్యాన్స్, బాటిల్స్ లో పెట్రోల్ పోసే సమయాల్లో ఒరిజినల్ పంపు నుంచి పోస్తారు. వాహనంలో పెట్రోల్ నింపే సమయంలో మోసాలకు పాల్పడుతున్నారు.

నిందితులపై పీడీ యాక్ట్ నమోదు

నిందితుల మోసాలపై అన్ని కార్పొరేషన్లను అప్రమత్తం చేశామని సీపీ తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామన్నారు. ముఠా వెనుక ఎవరున్నారు అనే కోణంలో విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ, ఏపీతో సహా ఇతర రాష్ట్రాల్లో కూడా మోసాలు చేసి ఉంటారని భావిస్తున్నామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## 12 నుంచి మరో 80 ప్రత్యేక రైళ్లు

దిల్లీ: రైల్వే సేవల పునరుద్ధరణలో భాగంగా మరిన్ని రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది. ఇప్పటికే 230 ప్రత్యేక రైళ్లు నడుపుతున్న ఆ శాఖ ఈ నెల 12 నుంచి కొత్తగా మరో 80 ప్రత్యేక రైళ్లను నడపనుంది. ఈ రైళ్లకు సంబంధించి ఈ నెల 10 నుంచి రిజర్వేషన్లు ప్రారంభం కానున్నాయని రైల్వే బోర్డు ఛైర్మన్ వినోద్ కుమార్ యాదవ్ వెల్లడించారు.

అలాగే, ఒకవేళ ఓ రైలుకు ఎక్కువ డిమాండ్ ఉన్నా, వెయిటింగ్ లిస్ట్ ఎక్కువగా ఉన్నా క్లోన్ రైలు నడుపుతామని వీకే యాదవ్ చెప్పారు. ప్రయాణికులు అందులో ప్రయాణించొచ్చని పేర్కొన్నారు. పరీక్షలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో రాష్ట్రాల కోరినట్లయితే రైళ్లు నడుపుతామని స్పష్టంచేశారు. పూర్తి స్థాయి రైళ్లు ఎప్పుడు ప్రారంభించేదీ వెల్లడించలేదు.

**తెలుగు రాష్ట్రాల్లో నడిచే రైళ్లివే..**

రైల్వే శాఖ తాజాగా ప్రకటించిన 80 ప్రత్యేక రైళ్ల జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి ప్రారంభమయ్యే/నడిచే రైళ్లు కొన్ని ఉన్నాయి.

వాటిలో సికింద్రాబాద్ - దర్భంగా (07007)బీ దర్భంగా- సికింద్రాబాద్ (07008)బీ బెంగళూరు- గువాహటి (02509), గువాహటి- బెంగళూరు (02510)బీ కోర్బా- విశాఖపట్నం (08517)బీ విశాఖపట్నం- కోర్బా (08518)బీ హైదరాబాద్- పార్భణి (07563)బీ పార్భణి- హైదరాబాద్ (07564) రైళ్లు ఉన్నాయి.

## కవి సమయం

### మోక్షమునకు సోపానం

సకల బంధ విముక్తియే మోక్షమునకు సోపానం  
మనసును స్వాధీనమొనర్చుకొని  
జ్ఞానాన్ని సారథిగా ఒనరించుకొని  
సాగించిన జీవన సాఫల్య యాత్ర  
దారిచూపును ముక్తికి  
ఉన్నదంతయూ ఒక్కటే  
తానే నేను, నేనే తానన్న  
అద్వైత భావన ముక్తి రహస్యం  
సర్వదా వివేకంతో మెలుగుతూ  
మనసును ఆకర్షించే వస్తువు సముదాయం  
సకల చరాచర జగత్తంతయూ అనిత్యమే  
శాశ్వతమైనది సర్వేశ్వరుని నామం ధ్యానం

...కవితా రచన  
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : భాద్రపద తిథి : చవితి సా.4.11; అశ్విని తె.3.44; రా.వ.11.18ల 1.04.

ఆదివారం 06-09 -2020

**మేషం** : బంధువులను కలుసుకుంటారు. రావలసిన ధనం వసూలు విషయంలో శ్రమాధిక్యత, ప్రయాసలెదుర్కొంటారు. నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి.తరచూ దైవ కార్యాల్లో పాల్గొంటారు. ఆత్మవిశ్వాసంతో సవాళ్ళను ఎదుర్కొంటారు.

**వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కో వలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి.

**మిధునం** :స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు.

**కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసుకుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి.

**సింహం** : పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసుకోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది.

**కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు.

**తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది.

**వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. సభలు, సమావేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు.

**ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శుభదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.

**మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు.

**కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యోగస్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయు లకు పనిభారం అధికమవుతుంది.

**మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది.



# లక్ష్మీదేవి స్వరూపమైన గోదాదేవి వృత్తాంతం!!

## సంకీర్తన

లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగంలో క్రీ.శ 776లో జన్మించినట్లు పురాణాలు చెపుతున్నాయి. ద్రవిడ భాషల్లో గోదాదేవికి కోదై, చూడిక్కొడుత్త నాచ్చియార్, ఆండాళ్, అనే నామాంతరములు గలవు. తెలుగు సాహిత్యంలో సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా ప్రఖ్యాతి వహించిన విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు రచించిన తెలుగు ప్రబంధం ఆముక్తమాల్యద గోదాదేవీ వైశిష్ట్యమునకు ప్రతీక. ఈ ప్రబంధానికి విష్ణుచిత్తీయం అనే మరోపేరున్న సంగతి తెలిసిందే.

ఇక గోదాదేవి జన్మ వృత్తాంత్తాన్ని ఓ సారి పరిశీలిస్తే.. శ్రీరంగంలో ఆషాఢ శుద్ధ చతుర్దశిన, పుబ్బ నక్షత్రంలో గోదాదేవి జన్మించింది. గోదాదేవి, శ్రీ విష్ణుచిత్తులకు పూల తోటలో లభించిన కుమార్తె. ఈమెను విష్ణుచిత్తుల దంపతులు చాలా అల్లారుముద్దుగా పెంచుకున్నారు. యుక్త వయస్సులో వచ్చిన తర్వాత లక్ష్మీస్వరూపమైన గోదాదేవి, తన శ్రీవారు అయిన రంగనాథుడినే తన పతిగా పొందాలనుకుంటుంది.

వైష్ణవుడైన విష్ణుచిత్తుడు రంగనాథ స్వామిని ప్రతినిత్యం భక్తిశ్రద్ధలతో కొలిచేవాడు. ఇందులో భాగంగా... ప్రతిరోజూ స్వామివారికి పూలమాలలను సుందరంగా అల్లుకుని అలంకరణకు తీసుకుని వెళ్లేవాడు. అయితే వాటిని గోదాదేవి ముందే ధరించి తర్వాత స్వామివారికి పంపిస్తుంది.

ఈ రహస్యం తెలుసుకున్న విష్ణు చిత్తుడు దుఃఖించి రంగనాథుడికి మాలాధారణ గావించరు. దీంతో స్వామివారి మొహం చిన్నబోతుంది, దీనికంతటికీ తన కుమార్తె తప్పిదమే కారణమని విష్ణుచిత్తుడు బాధపడుతుంటే.. రంగనాథుడు విష్ణుచిత్తునితో ఇక ప్రతిరోజూ తనకు గోదాదేవి ధరించిన మాలాధారనే కావాలని ఆదేశిస్తారు. రంగన్న ఆదేశం మేరకే విష్ణుచిత్తుడు నడుచుకుంటాడు. ంతలో శ్రీరంగనాథుడే తనకు భర్తగా రావాలని కోరుకుంటూ గోదాదేవి... తన తోటి బాలికలతో కలిసి తిరుప్పావై (తిరుప్పావు) వ్రతాచరణ చేస్తారు. ఈ వ్రతమహిమతో... లక్ష్మీ స్వరూపమైన గోదాదేవి శ్రీరంగనాథుడి సతీమణి అవుతుంది. రంగనాథుడి ఆజ్ఞమేరకే గోదాదేవికి, రంగనాథస్వామికి విష్ణుచిత్తుడు దేవేరులకు భూలోకంలో వైభవంగా వివాహం జరిపించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. వివాహానంతరం గోదాదేవి ఆ చిద్విలాసునిలో లీనమవుతుంది. అదిచూసి విష్ణుచిత్తుడు దుఃఖితుడైతే మలయప్ప స్వామి జ్ఞానోపదేశం చేస్తాడు. దీంతో విష్ణుచిత్తుడు గోదాదేవి లక్ష్మీస్వరూపి అని, తన కుమార్తె అన్న మాయ నుంచి బయటపడతాడు. ఇకపోతే... గోదాదేవి వ్రతాచరణ సమయంలో రచించిన తిరుప్పావై చాలా ప్రసిద్ధి చెందింది.

దీనిని ధనుర్మాసంలో ప్రతిరోజూ రోజుకొక్కటి చొప్పున ఓ పాశురం వైష్ణవ ఆలయాల్లో పఠించడం చేస్తారు. అందుచేత యువతులు ధనుర్మాసంలో 30 రోజుల పాటు గోదాదేవి వ్రతాచరణ చేస్తే తను మెచ్చిన, సుగుణుడైన భర్త లభిస్తాడని పురాణాలు చెబుతున్నాయి.

# టీచర్స్ రిజెక్ట్ ఎన్ ఈపి - 2020




అచ్యుతాపురం : అఖిల భారత విద్యా హక్కు వేదిక పిలుపు మేరకు జిల్లాలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా " టీచర్స్ రిజెక్ట్ ఎన్ ఈపి - 2020 " నినాదంతో సామాజిక మాధ్యమ ఉద్యమాన్ని నిర్వహించినట్లు డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి మధు అన్నారు . శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతన విద్యావిధానం ఉపసంహరించు కోవాలంటు ఉపాధ్యాయిని , ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు . ఈ నిరసనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర కేబినెట్ ఆమోదించిన జాతీయ నూతన విద్యావిధానం సామాజిక బాధ్యత గల ఏ టీచర్ కు ఆమోదం కాదన్నారు . ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పాఠ్యప్రణాళిక రూపకల్పన తదితర అంశాలలో రాష్ట్రాల హక్కులకు స్వేచ్ఛ లేకుండ కేంద్ర ప్రభుత్వ పెత్తనం సహించరానిదన్నారు . ప్రవేటీకరణ నియంతరణకు ఎటువంటి సీపార్స్ లేదన్నారు . నియామకాలు , పదోన్నతలలో రిజర్వేషన్ల ప్రస్తావనే లేదంటే సామాజిక న్యాయాన్ని నిరాకరించడమే అవుతుందన్నారు . అందువల్ల జాతీయ నూతన విద్యావిధానాన్ని తిరస్కరిస్తున్నట్లు మధు పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో మారిశెట్టి వెంకటప్పారావు , కొల్లి రాజు , కె ఎస్ శాస్త్రి , ఎం సత్యనారాయణ , చిరంజీవిరావు , ఉపాధ్యాయిని లు తదితరులు పాల్గొన్నారు .

# సంక్షేమం ముసుగులో దోపిడీ



అనకాపల్లి : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల ముసుగులో ప్రజలపై పన్నుల భారం వేసే ప్రయత్నం చేస్తున్నారని ఇంటి పన్నులు , రవాణా శాఖ, మద్యం రేట్లు నిత్యావసర ధరలు రేట్లు పెంచుతున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొణతాల వెంకటరావు విమర్శించారు. ఇప్పటికే ఆర్టీసీ బస్ చార్జీలు పెట్రోల్ ధరలు భూముల ధరలు మద్యం ధరలు పెంచారని మరల ప్రజలపై పెద్దఎత్తున పన్నుల భారం మోపుతున్నారని వెంకటరావు తెలిపారు. ప్రభుత్వం పట్టణాల్లో ఆస్తి పన్నులు పెంచాలనే ఆలోచన సరికాదని ఒకవైపు కరోనా వైరస్ వలన ఆర్థిక మాంద్యంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని వ్యాపారాలు దెబ్బతిన్నాయని ఉపాధి కోల్పోయారని వెంకటరావు తెలిపారు ఇటువంటి తరుణంలో ఆస్తి పన్నుల్లో రాయితీ ఇవ్వాలని వడ్డీలు పెనాల్టీలు రద్దు చేయాలని ప్రజలు ప్రజలతో పాటు ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు కోరుతున్నారు ఈ అంశాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించకుండా క్లిష్ట సమయంలో ఆస్తి పన్నులు పెంచాలనే ఆలోచన చేయడం శోచనీయమని వెంకటరావు అన్నారు గతంలో ప్రపంచ బ్యాంకు కేంద్ర ప్రభుత్వం విషమ షరతులు విధించి అద్దె విలువ ఆధారంగా పన్నులు పెంచాలని ప్రయత్నించగా ప్రజలు వ్యతిరేకించారని కేంద్ర ప్రభుత్వం కరోనా మాటున ప్రజావ్యతిరేక సంస్కరణలు అమలు చేయడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని వెంకటరావు తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం రుణ పరిమితిని సడలించిడానికి షరతులు విధిస్తుందని దీనిలో మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను పెంచడం యూజర్ చార్జీలు విధించడం వంటివి ఉన్నాయని వెంకటరావు వివరించారు ఇటువంటి ప్రజా వ్యతిరేక షరతులను వ్యతిరేకించ వలసిన వైసీపీ ప్రభుత్వం షరతులుకు లొంగి అమలు జరిపే ప్రయత్నం చేయడం తగదన్నారు ఇ ప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పన్నులు పెంచాలనే ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వాన్ని వెంకటరావు డిమాండ్ చేశారు.

## ఆదర్శ హిందీ ప్రేమీమండలి ఆధ్వర్యంలో
# ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం




భీమునిపట్నం : ఆదర్శ హిందీ ప్రేమీమండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆదర్శ హిందీ ప్రేమీమండలి గౌరవ అధ్యక్షుడు గంటా.నూకరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ 1888లో జన్మించారని , ఆయన సాహిత్య బహుమతి కి 15 సార్లు ,నోబెల్ శాంతి బహుమతి కి 11సార్లు పొందిన వ్యక్త ని తెలిపారు. ఆయన గురువులకే గురువు కనుక సెప్టెంబర్ 5 ఆయన పుట్టినరోజు ను ఉపాధ్యాయ దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు .ఉపన్యాసం ఆయన చేతుల మీదుగ రాష్ట్ర భాష విశారద,ప్రావీణ పరీక్షల లో ఉత్తీర్ణత సాధించిన 4గురు విద్యార్థులకు మార్కుల లిస్టు లు పంపిణీ చేశారు.

## మాతృభూమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు



భీమునిపట్నం : ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మాతృభూమి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వెల్లంకి గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు ప్రదానోపాధ్యాయులు బాబు లాల్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ భారతదేశ మొట్ట మొదటి ఉపరాష్ట్రపతిగా మరియు రాష్ట్రపతిగా దేశానికి వారి సేవలు అందించార ని. సర్వేపల్లి రాధాకృష్ణ ఒక మహోన్నతమైన వ్యక్తి అని ఆయన ఎన్నో విద్య సంస్కరణలు చేశారని తెలియజేశారు. మాతృ భూమి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొర్రాయి తేజ ఆశిష్ మాట్లాడుతూ ఇంతటి ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చి, గురువు జాతి గౌరవాన్ని లోకానికి చాటి చెప్పిన మన దేశ రెండో రాష్ట్రపతి, మేధావి, విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణ జయంతిని ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవంగా గుర్తించింది. ప్రతి యేటా సెప్టెంబర్ 5న గురువు లను గౌరవించుకునే అవకాశాన్ని కల్పించింది.దేవుడు, గురువు పక్కపక్కనే ఉంటే నేను మొదట గురువుకే నమస్కరిస్తా అన్నారు మహానుభావుడు కబీర్ దాస్. ఎందుకంటే.. ఆయన భగవంతుడు అని మొదట తనకు చెప్పింది గురువే కాబట్టి అని వివరించారు. సమాజంలో గురువుకు ఉన్న స్థానం అంత గొప్పది. 'గు' అంటే చీకటి, 'రు' అంటే పోగొట్టేది అని అర్థం. అంటే మనలో అజ్ఞాన పొరలు తొలగించి, జ్ఞానదీప్తిని వెలిగించేవాడు గురువు అన్నమాట. అలాంటి గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనది అని తెలియజేస్తూ. ప్రతి ఒక్క ఉపాధ్యాయులకి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈ సందర్భంగా ప్రధానోపాధ్యా యులు మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మాతృ భూమి ఫౌండేషన్ సభ్యులు జీవన్, దుర్గారావు, ప్రదీప్, సాయి, మణికంఠ పాల్గొన్నారు.

# కరోనా వారియర్స్ సేవలు అభినందనీయం

**భీమిలి 3వవార్డు బిజెపి అధ్యక్షుడు లయన్ డాక్టర్ సత్తరవు వాయునందనరావు**



భీమునిపట్నం : కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందించిన కరోనా వారియర్స్ సేవలు అభినందనీయమనీ భీమిలి 3వవార్డు బిజెపి అధ్యక్షు డు లయన్ డాక్టర్ సత్తరవు వాయునందనరావు అన్నారు. వైరస్ కట్టడి చేయడానికి శ్రమించి కరోనా బారిన పడి కోలుకున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా. దిద్దే సిద్దార్థ కుమార్, ఎస్.ఐ రాంబాబు ల సేవలు గుర్తించి బిజెపి తరపున మెమెంటో ఇచ్చి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో విధి నిర్వహణలో భాగంగా కరోనా వైరస్ బారినపడిన కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సేవలు మరిచిపోలేమని అన్నారు. కరోనా వైరస్ బారినపడకుండా ప్రజలకు ఎన్నో జాగ్రత్తలు తెలియచేస్తూ వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వైరస్ కట్టడికి శ్రమించి కరోనా వైరస్ బారిన.పడి కోలుకుని తిరిగి సేవలు అందించిన డాక్టర్ సిద్ధార్థ్,ఎస్.ఐ రాంబాబు లకు భీమునిపట్నం బీజేపీ తరపున మెమెంటో ఇచ్చి సత్కరించారు.

# భీమిలి లో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

భీమునపట్నం : భీమిలి జోన్ లో మున్సిపల్ హైస్కూల్ 18 వ వార్డు లో ఉపాధ్యాయుల. దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక మాజీ కౌన్సిలర్ పాసి స్వర్ణలత జ్యోతి ప్రజ్వలన చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాచలం చెట్టి మరియు స్థానిక మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణ్ రావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేశి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత చరిత్రను వివరిస్తూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువకులందరు ఆయన బాటలో నడవాలని ఆయనంతటి గొప్ప వ్యక్తులుగా ఎదగాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో యెచ్చెర్ల హరి, గుర్రాల పండరినాథ్, ఎస్ సుజాత కుమారి ఎ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నక్కవానిపాలెం, పి&టి కాలనీ, ఎన్ఎంసిహెచ్ స్కూల్ టీచర్ కోకిలరాణికి 1995 బ్యాచ్ పదవతరగతికి చెందిన నాగు, ప్రసాద్, చఖిలిరావు, హనుమ, ఎం.జ్యోతి, సంధ్య, లావణ్య, మీనా తదితర విద్యార్థులు ఘనంగా సన్మానం చేసి, అనంతరం కేక్ కట్ చేసి ఉపాధ్యాయ దినోత్సవంను ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం ఆమెకు పాదాభివందనం చేశారు.

# నిత్యావసర సరుకులు పంపిణీ

భీమునిపట్నం : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వృక్షో రక్షతి రక్షితః అనే ఉద్దేశ్యంతో జీవిఎంసి భీమిలి జోన్ ఒకటవ వార్డ్అభ్యర్థి పరిమి భువనేశ్వరి మన తగరపువలస జ్యూట్ మిల్ రామాలయం వద్ద గల పవిత్ర గొస్తనీ నదీ సమీపంలో ఉన్న స్మశాన వాటిక యందు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాము ఖ్యతను వివరించి ప్రజలందరూ మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని ప్రజలను కోరారు.

ఈ కార్యక్రమంలో...

జనసైనికులు, ముత్యాలరావు ,ప్రసాద్ మరియు ఇతరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధి కోల్పోయిన ప్రయివేట్ టీచర్స్ కి తమ వంతు సహాయార్థం నిత్యావసర సరుకులు అందించారు.ఈ కార్యక్రమంలో తాతా థియేటర్ రవి మరియు జనసైనికులు పాల్గొన్నారు.






## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడి
# కార్మికులు, రైతులు, పేదలను ఆదుకోవాలి




అచ్యుతాపురం : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడి కార్మికులు , రైతు, వ్యవసాయ కార్మికులు,పేదలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు అన్నారు . కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడలని సిఐటియు ఆద్వర్యంలో శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు . ఈ ధర్నా లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అందరికి ఆరోగ్య సౌకర్యాలు కలిపించాలి. ప్రతి కుటుంబానికి 6 నెలల పాటు నెలకు రూ.7500 చొప్పున అందించి ఆర్థికంగా ఆదుకోవాలి. ప్రభుత్వ రంగ సంస్థలు, సర్వీసులు ప్రవేటీకరణ విరమించుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రొంగలి రాము, కూంద్రపు సోమునాయుడు, పి శ్రీరాములు, ఎం భారతి, సిహెచ్ ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# భరత్‌నగర్ సీనియర్ సిటిజన్స్ పార్కుకు బల్లలు వితరణ



గాజువాక: జీవీఎంసీ86వ వార్డు పరిధి భరతనగర్ సీనియర్ సిటిజన్స్క్ పార్కు కమిటీకి తెదేపా సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ లేళ్ళ కోటేశ్వరరావు మాతృమూర్తి స్వర్గీయ లేళ్ళ అహల్య జ్ఞాపకార్థం బెంచీలను శనివారం వితరణ చేశారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్య పట్ల అవగాహన రోజు రోజుకి పెరగ డంతో వాకింగ్ చేసే వాళ్లు సేదతీర్చు కోవడానికి ఉపయోగపడేందుకు ఈ కార్య క్రమం తలపెట్టారన్నారు. కరోనా మహ మ్మారి నుంచి అందరూ సురక్షి తంగా ఉండేలా సూచనలు ఇచ్చారు. ఈ కార్య క్రమంలో వార్డు అధ్యక్షులు కర్రి ఈశ్వరరావు, తుంపాల శ్రీను, చల్లగుళ్ళ శ్రీనివాస్, మరియు భరత్ నగర్ కమిటీ అధ్యక్షులు రాజు, గునేశ్వర రావు, సన్యాసి రావు, రామ లింగ రాజు, రామకృష్ణ, నరసింహారావు, జె.ఎన్.రావు, రమణ, జగన్ మోహన్, లోకనాథం, కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రత తోనే

# డెంగ్యూ, మలేరియా నివారణ సాధ్యం



కంచరపాలెం : పరిశరాల శుభ్రత తోనే డెంగ్యూ, మలేరియా నివారణ సాధ్యమని జీవీఎంసీ ప్రజారోగ్య ప్రధాన వైద్యాధికారి శాస్త్రి పేర్కొన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 49వ వార్డు పరిది ప్రకాష్ నగర్ లో శనివారం స్థానికులకు డెంగ్యూ, మలేరియా, చికున్ గనియా తదితర సీజన్ వ్యాధుల పట్ల నిర్వహించిన అవగాహణ సదస్సులో ఆయన పాల్గున్నారు . కార్యక్రమంలో బాగంగా డెంగ్యూ, మలేరియా, చికున్ గనియా తదితర వ్యాధుల నివారణపైన అలాగే తడి-పొడి చెత్త సేకరణపై స్థానికులకు అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నందున ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మూడు రోజుల కంటే నీటిని నిల్వ ఉంచరాదని డ్రమ్ముల పైన, నీళ్ల కుండీల పైన, నీటి ట్యాంకుల పైన మూతలు పెట్టాలని మూతలు లేకపోతే పాత వస్త్రం కప్పాలని సూచించారు. అలా చేయకపోవడం వలన డెంగ్యూ కారక దోమలు ఆ నీటిలో గ్రుడ్లు పెట్టి అవి దోమలుగా తయారవుతాయన్నారు. అలాగే ఇంట్లో ఫ్రిజ్, ఫ్లవర్ వాజ్, మనీప్లాంట్, నీటి తొట్టెలను ప్రతీ రోజు శుభ్రపర్చాలన్నారు. ఇంటి ఆవరణలో పాతటైర్లు, వాడి పడేసిన కొబ్బరిబొండాలు, బిరడాలు లేని సీసాలు ఉండరాదన్నారు. డెంగ్యూ కారక దోమలు కేవలం మంచినీటిలోనే ఉంటాయని అలాగే ఆ దోమలు పగటి పూటే కుడతాయన్నారు. కాలువల్లోనూ, మురుకి నీటిలోనూ డెంగ్యూ దోమలు ఉండవన్నారు. ప్రతీ ఆదివారం ఉదయం పది గంటలకు పది నిమిషాల పాటు ప్రతీ ఒక్కరూ ఇంటిలో నీటి నిల్వలు లేకుండా డ్రైడే పాటించాలన్నారు. జ్వరాలన్నీ డెంగ్యూ జ్వరాలు కావని అయినప్పటికీ జ్వరం వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా దగ్గరలో గల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళాలన్నారు. డెంగ్యూ నిర్ధారణ పరికరాలు కేవలం కేజీహెచ్ లో మాత్రమే ఉన్నాయని మరే ఇతర ప్రయివేటు ఆసుపత్రిలో లేవని కాబట్టి జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలో గల ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే అక్కడ వైద్యులు రక్త మూలాలను సేకరించి అవి డెంగ్యూ నిర్ధారణ నిమిత్తం కేజీహెచ్ కు పంపించడం జరుగుతుందన్నారు. అలాగే ఇంట్లో లభ్యమయ్యే వ్యర్థాలను తడి-పొడి చెత్తగా వేరుచేసి తమ గృహాలకు వచ్చే పారిశుద్య కార్మికులకు అందజేయాలన్నారు. అలా కాకుండా వ్యర్థాలను కాలువల్లోనూ, రహదారులపైన వేస్తే వ్యాధులు వ్యాప్తి చెంది అయా ప్రాంత నివాశితులంతా అనారోగ్యం పాలవుతారని ఆయన పేర్కొన్నారు. అనంతరం డెంగ్యూ, మలేరియా, చికున్ గనియా వ్యాధి కారక దోమలు ఎక్కడ ఉంటాయో, ఎలా వృద్ధి చెందుతాయో ఎగ్జిబిషన్ ద్వారా స్థానికులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జోన్ - 4 ప్రజారోగ్య శాఖ సహాయ వైద్యాధికారి రాజేష్, శానిటరీ ఇనిస్పెక్టర్ల సూపర్ వైజర్ కిషోర్, వార్డు శానిటరీ ఇనిస్పెక్టర్ నమ్మి శివ ప్రసాద్ యాదవ్, మలేరియా ఇనిస్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



పెద్దాపురం : గౌరవ ముఖ్యమంత్రివర్యులు వైయస్.జగన్మోహనరెడ్డి పంచాయత్ రాజ్ శాఖలో 51 డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ పోస్టులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. రెండు దశాబ్దాల కలల్ని సాకారం చేస్తూ, ప్రమోషన్లు లేకుండా ఉన్న ఎంపీడీఒలకు ప్రమోషన్లు కల్పించడం... తద్వారా పిఆర్ లో ఆఫీస్ సబార్డినెట్లు, పంచాయతీ కార్యదర్సులు, మినిస్టరీయేల్ స్టాఫ్, ఏ.ఓలు, ఈఓ. పి.ఆర్ బీఆర్.డి వరకూ 12 కాడర్లలో ప్రమోషన్స్ కదలికకు నాంది పలకటం పట్ల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పెద్దాపురం మండలంలో పంచాయతీ, సచివాలయ మరియు మండల పరిషత్ సిబ్బందిని పెద్ద ఎత్తున సమీకరించి గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుట జరిగినది. ఈ కార్యక్రమము నందు మండల పరిధిలోఅందరు పంచాయితీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, విస్తరణాధికారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురుపూజోత్సవం

### గురువులను ఘనంగా సత్కరించిన వైసీపీ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు విల్లూరి భాస్కరరావు



విశాఖపట్నం : అంతులేని జ్ఞానాన్ని అందించి.. ఉత్తమమైన భావి భారత పౌరులను.. తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే... విశాఖ, దక్షిణ నియోజకవర్గం, 35 వ వార్డులో.. గురు పూజోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైసీపీ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకులు, ఆధ్యాత్మికవేత్త, వీఎంఆర్ ఫౌండేషన్ అధినేత విల్లూరి భాస్కరరావు గురువులను ఘనంగా సత్కరించారు. పూలమాలలు, శాలువాలతో వారిని సన్మానించారు. తల్లి దండ్రులు జన్మనిస్తే.. గురువులు వారికి జీవితాన్ని అందించి పునర్జన్మ నిస్తారని ఆయన కొనియాడారు. విద్యార్థులకు అంతులేని జ్ఞానాన్ని అందించి వారిని ఉత్తమ మైన భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు మాత్రమేనని ప్రశంసించారు. భారతీయులు.. గురువులను.. దైవంతో సమానంగా భావిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





గురుపూజోత్సవం సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలో స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ, పూజారి హరిప్రకాష్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి సంబంధిత ప్రొఫెసర్లకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సిబ్బంది పూజారి హరి ప్రకాష్ కు ఘనంగా సత్కరించారు.

## టీడీపీ ఆధ్వర్యంలో గురు పూజోత్యవం సందర్భంగా ఉపాధ్యాయులకు సన్మానం



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు నందు ఉన్న శ్రీ శారద స్కూల్ ప్రిన్సిపాల్ బోనగిరి. శ్రీనివాస్ ను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సన్మానించారు.ఈ సందర్భంగా వారు సర్వేపల్లి. రాధాకృష్ణ గారి కృషిని కొనియాడుతూ ప్రయివేట్ ఉపాధ్యాయుల కృషిని ప్రభుత్వం గుర్తించాలని వారు ఈ కరోనా కాలంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయని,ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, ప్రైవేట్ ఉపాధ్యాయులకు కూడా సహాయాన్ని అందించే చర్యలు చేపట్టాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజాల. చిట్టిబాబు,సరమర్ల. మధుబాబు,బండారు.సురేష్, చింతపల్లి.దాసు,రాజాల.శాస్త్రి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యావిధానం ఉపసంహరించుకోవాలి



కంచరపాలెం : నూతన విద్యావిధానం ఉపసంహరించుకోవాలని అదేవిదంగా అంగన్వాడీ ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యునియన్ ( సి.ఐ .టి.యు ) అర్బన్ -1 ప్రాజెక్ట్ అద్యక్షురాలు బి.తులసి కోరారు. ఈమేరకు ఆర్ .అండ్ .బి కూడలి వద్ద నున్న ఐ.సి.డి.ఎస్ అర్బన్ -1 సిడిపిఒ ఝన్సీ రాణి కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లడుతూ విద్యా రంగంలో కేంద్రీకరణ,వ్యాపారీకరణ, మతతత్వాన్ని ప్రోత్సాహించే లక్ష్యంతో నూతన విద్యావిధానం (నేప్) -2020 ని కేంద్ర క్యాబినేట్ అప్రజాస్వామ్యకంగా ఆమోదించిందని . రాజ్యాంగంలో విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించకుండా, దేశ అత్యున్నత చట్టసభ అయినా పార్లమెంటులో చర్చ లేకుండా కేంద్ర మంత్రివర్గం ఏకపక్షంగా నూతన విద్యావిధానాన్ని ఆమోదించిందని ఆరోపించారు . ఇప్పటివరకు 10ం2ం3 స్థానంలో 5ం3ం3ం4 విద్యను తీసుకొని రానున్నారు. అంటే శిశు విద్యను కూడా (3-18సంఎఎ) పాఠశాల విద్యలోకి చేరుస్తున్నారు. అంగన్ వాడీలను పాఠశాల విద్యకు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. దీని వలన అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రస్తుతం నడుస్తున్న ఈ .సి.సి .ఈ విధానం ప్రక్కకు పోతుందని . క్రమంగా అంగన్‌వాడీ సెంటర్లు ముగింపు దశకు వచ్చే ప్రమాదం ఉందని అవేదన వ్యక్తం చేసారు . అందువలన ఎన్ .ఈ .పి -2020ని ఉపసంహరించుకొని,అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయాలి. అంగన్ వాడీ సెంటర్లు వెయ్యి జనాభా పరిధిలో బాలింతలు, పసిపిల్లల మనోవికాశానికి అన్నప్రాశాలు, శ్రీమంతాలు, తల్లి పాల వారోత్సవాలు, పౌష్టికాహార వారోత్సవాలు, పరిశుభ్రతా వారోత్సవాలు లాంటి అనేక కార్యక్రమాలు నిరంతరంగా జరుగుతున్నాయి. అందరికీ అంగన్వాడీ

కేంద్రాలు అందుబాటులో ఉంటాయని అంగన్ వాడీ సెంటర్లను ఎలిమెంటరీ పాఠశాలలో కలపడం వలన లబ్ధిదారులకు అంగన్ వాడీ సెంటర్లు దూరమవుతాయన్నారు .అంగన్ వాడీలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, అంగన్ వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటుగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అంగన్వాడీ హెల్పర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్షిత స్కూల్ ఉపాధ్యాయులకు నిత్యవసర సరుకులు పంపిణీ



గాజువాక : అక్షిత స్కూల్ ఉపాధ్యాయులకు 65వ్ వార్డ్ జనసేనాపార్టీ, బీజేపి బలపర్చిన ఉమ్మడి కార్పొరేటర్ అభ్యర్థి రెయ్యి రత్నం నిత్యావసర సరుకుల ను అందజేశారు. శని వారం వార్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెయ్యి రత్నం మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో గత ఏడు నెలలుగా స్కూల్ లు లేక ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలమేరకు గాజువాక జనసేన పార్టీ ఇంచార్జీ కోన తాతారావు సహకారంతో అక్షిత స్కూల్ ఉపాధ్యాయులు అందరికీ నిత్యవసర వస్తువులు పంపిణీ చెయ్యడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు ఉన్న ప్రస్తుత ప్రభుత్వం కనీసం వారి బాధను పట్టించుకోకపోగా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుంది ఆవేదనలను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి ఉపాధ్యాయులను ఆదుకోవాలని, వారికి ప్రత్యేకమైన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అక్షిత స్కూల్ ప్రధానోపాధ్యాయులు భవానీ, జనసేన నాయకులు మజ్జి వాసు, సీరం రమేష్, దినేష్, నాయుడు, జగదీష్ తదితర జనసైనికులు పాల్గొన్నారు.

### సెయింట్ ఆంథోనీ హై స్కూల్ 1992-1993 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

## టెంపరరీ టీచర్స్‌కు రేషన్ సరుకులు వితరణ



విశాఖపట్నం : టీచర్స్ డే సందర్భంగా సెయింట్ ఆంథోనీ హై స్కూల్ 1992-1993 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సంగం కీ.శే. సిరికి గణేష్ నాయుడు పేరు మీద గా టెంపరరీ టీచర్స్ కు నెలకు సరిపడే రేషన్ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమం లో పూర్వ విద్యార్థులు 1.బోని శ్రీనివాసరావు 2.కోన ప్రకాష్ 3.బల్లంకిల్ల నవీన్ కుమార్ 4.ఏలూరి కిరణ్ కుమార్ 5.సారిపల్లి ప్రసన్న కుమార్ 6.ఎలిశెట్టి మహేష్ 7.మళ్ళ సురేష్ కుమార్ 8.మన్యాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

## సైన్స్ మాస్టార్ కుమార్ కు ఘన సత్కారం



ములగాడ: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీహరింపురం హై స్కూల్ లో స్వర్గీయ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పశ్చిమ నియోజకవర్గ సంఘ సేవకులు పెదరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో శనివారం మల్కాపురం హై స్కూల్లో నిర్వహించారు. అనంతరం సైన్స్ మాస్టర్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. శాలువా వేసి, పుష్పగుచ్ఛాన్నిచి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. తాను ఈ స్కూల్లో చదువుకున్న పూర్వ విద్యార్థినని, తన చేతుల మీదుగా తన గురువు గారైన సైన్స్ మాస్టర్ కుమార్ గురువు ను సత్కరించటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. గురువులు బోధించిన పాఠాలు, సత్యాలు, తూ.. చ.. తప్పకుండా నేర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామని అన్నారు. ఎదిగిన ప్రతిఒక్కరి వెనుక ఉపాధ్యాయుల కృషి ఉందని అన్నారు. గురువులను గౌరవించవలసిన బాధ్యత ప్రతిఒక్కరి పై ఉందని అన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరయ్యారు.

## ప్రైవేట్ ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలని

# గాంధీ విగ్రహం వద్ద టీచర్స్ నిరసన




విశాఖపట్నం : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేట్ ఉపాధ్యాయులను ఆదుకోవాలని ఈ రోజు ఉదయం విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ మరియు ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ (పిటిఎల్‌పిడబ్ల్యుఎ) ఆధ్వర్యంలో నిరసన తెలియ జేయడమైనది. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ నగర జిల్లా అధ్యక్షులు టి.రవికుమార్, జాయింట్ సెక్రటరీ స్వప్నలు మాట్లాడుతూ కరోనా లాక్‌డౌన్ నేపధ్యంలో ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ మరియు నాన్ టీచింగ్ స్టాఫ్ జీతాలు లేకపోవడంతో 6 నెలలుగా ఇబ్బందులు పడుతున్నాము. మార్చి నెలలో లాక్‌డౌన్ విధించిన నుండి ఉద్యోగాలు లేక ఆదాయాలు రాక మా కుటుంబాలన్నీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. ఇప్పటివరకు ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో ఎంతోకొంత జీతాలకు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ సమాజానికి కావలసిన భావిభారత పౌరులను తీర్చుదిద్దుతున్నామన్న సామాజిక కోణంతో పనిచేస్తూ వస్తున్నాము.

కానీ ఇటువంటి మాకు నేడు విద్యాసంస్థలు మూతపడడంతో మా బ్రతుకులు ఛిద్రమయ్యాయి. ఏం చేయాలో తెలియక, కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక ఆత్మాభిమానాన్ని ప్రక్కన పెట్టి ఎంతోమంది ఉపాధ్యాయులు ఉపాధి పనులు దగ్గర నుండి కూరగాయలు, చెప్పులు, బట్టలు, టీబడ్డీలను పెట్టుకుని బ్రతుకును ఈడ్చుతున్నారు. ఎన్నో కుటుంబాలు పస్తులు కూడా ఉండాల్సి వస్తోంది.

ఈ తరుణంలో ప్రభుత్వం అనేక వర్గాల ప్రజలకు అనేక రూపాలలో సాయమందిస్తోంది. దీనిలో భాగంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను ఆదుకునేందుకు విద్యా సంస్థలు తెరిచే వరకు నెలకు 10,000/-లు ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నాము. అలాగే ప్రభుత్వం మా కుటుంబాలను ఆదుకోవడంతో పాటు మాకు హెల్త్ కార్డులు మంజూరు చేసి, మెరుగైన వైద్యాన్ని అందించాలి. ప్రభుత్వమే గుర్తింపు కార్డులు మంజూరు చేసి ఈ ఐ.డీ. కార్డుల ద్వారా సర్వీస్ మెయింటైన్ చేయాలి. ప్రైవేట్ టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు సమకూర్చి ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి. ఈ కార్పొరేషన్ ద్వారా ఇళ్లు కట్టుకునేందుకు ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నాము.

ఈ కార్యక్రమానికి డి.వైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు సంఘాలు మద్దతు తెలియజేశాయి. దీనిలో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ.అనీల్ కుమార్, వి.వి.శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు యుఎస్ఎన్ రాజు, గణేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎల్.చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

# నాగభూషణరావు లేని లోటు తీర్చలేము

**నాగభూషణ రావు మృతిపట్ల ఆమెను కలిసి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రివర్యులు ధర్మాన కృష్ణదాస్**



శ్రీకాకుళం : పాతపట్నం నియోజక వర్గ శాసనసభ్యురాలు రెడ్డి శాంతి భర్త కీ.శే. రెడ్డి నాగభూషణ రావు మృతిపట్ల ఆమెను కలిసి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రివర్యులు ధర్మాన. కృష్ణ దాస్ శనివారం పాతపట్నం గ్రామంలో రెడ్డి శాంతిని కలసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రివర్యులు ధర్మాన కృష్ణ దాస్ నాగభూషణ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తదనంతరం ఆయన కీర్తిశేషులు రెడ్డి నాగభూషణ రావు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగభూషణ రావు సేవలు చిరస్మరణీయమని,పాతపట్నం ప్రజలు గొప్ప వ్యక్తిని కోల్పోయారని పేర్కొన్నారు. నాగ భూషణ రావు మృతిపట్ల మన ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు అని ఆయన తెలియజేశారు. నాగ భూషణ రావు లేని లోటు తీర్చలేదని అన్నారు.

## రైతుభరోసా కేంద్రాలను పరిశీలించిన కలెక్టరు వినయ్‌చంద్




అచ్యుతాపురం : మండలంలో హరిపాలెం, చీమలాపల్లి గ్రామాలలో శనివారం జిల్లా కలక్టరు వినయ్ చంద్ పర్యటించారు.

ఈ సందర్భంగా రైతుభరోసా కేంద్రాలను పరిశీలించారు.

# అప్పన్న గోల్డ్ బిస్కెట్ స్కామ్ విచారణ చేపట్టిన ఆజాద్ కమిటీ

## అనుమానితులను తాత్కాలికంగా విధులు నుండి తొలగింపు



సింహాచలం: అప్పన్న గోల్డ్ బిస్కెట్ స్కామ్ వాస్తవాలు నిర్ధారించేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలు మేరకు ఆజాద్.. రీజినల్ జాయింట్ కమిషనర్.. రాష్ట్ర దేవాదాయ శాఖ ఆజాద్ కమిటీ శనివారం నాడు విచారణ చేపట్టారు విచారణలో భాగంగాహైమావతి తమ్ముళ్ళుగా చెపుతున్న శేఖర్, మధు పాత్రలపై ప్రాధమికంగా దార్యాప్తు చేసి.. ముందుగా వారిద్దరిని తాత్కాలికంగా విధులనుంచి వారిని తొలగించారు. దీనితో పాటు ఈ స్కాం టీమ్ ముగ్గురిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆజాద్ మీడియాతో తెలిపారు. ఈ విషయంలో భయట వినిపిస్తున్న సమాచారం మేరకుఇంటిదొంగలని ఈశ్వరుడైన పట్టలేరనే సామెత ఉంది. కానీ ఇక్కడ ఇంటి దొంగలని వారి కుటుంబంలోని మహిళే పట్టించినట్ల య్యింది. మరో ప్రక్క సింహాచలం దేవస్థానంలో రోజుకో అవినీతి, వివాదాలు బయటపడుతున్నాయి. ఇక్కడ సరిగ్గా అదేజరిగింది. ఎకంగా అప్పన్న బంగారం విక్రయం పేరుతో ఒకటి, రెండు కాదు ఏకంగా కోటి నలభై నాలుగు లక్షల రూపాయలు. అదీ దర్జాగా ఒక అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు.. సింహాచలం దేవస్థానం రసీదు కూడా సృష్టించేశారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఒక పథకాన్ని పన్ని సింహాద్రి అప్పన్న బంగారాన్ని అమ్ముతున్నారని చెప్పి నెల్లూరు సూళ్లూరు పేటకు చెందిన శ్రావణి అనే మహిళను నమ్మించారు సింహాచాలానికి చెందిన హైమావతి అండ్ టీమ్.. గతంలో ఇక్కడికి వచ్చిన శ్రావణి కుటుంబానికి అప్పన్న దర్శనం చేయించి, పరిచయం పెంచుకున్నారు. ఆ పరిచయాన్ని ఆసరాగా తీసుకుని ఆ మహిళను బురిడీ కొట్టించారు. పక్కాగా ప్లాన్ ప్రకారం దేవస్థానం ఈవో భ్రమరాంబ సంతకంతో పాటు...మిస్లేనియోస్ రసీదు కూడా ఆ బాధిత మహిళకు అందజేశారు. దీనితో ఇది నిజమేనేమో అని నమ్మిన శ్రావణి దఫాదఫాలుగా నగదు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఈ ట్రాంజాక్షనంతా హైమావతి తమ్ముళ్లు.. దేవస్థానంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ ఉద్యోగుల సహకారంతో జరిగినట్లు దేవస్థానం అధికారుల దర్యాప్తులో తెలుతుందని పలువురు నొక్కి చెబుతున్నారు.

# ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం




దేవరాపల్లి : మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిను పురస్కరించుకొని శనివారం మండలంలో పలు పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గురుపూజోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తయారయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పలు చోట్ల విద్యార్థులు ఉపాధ్యాయులు గొప్ప తనాన్ని వివరించారు.

# భావనపాడు నిర్మించండి... సంతృప్తి ప్యాకేజి ఇవ్వండి...




**మొదటి పేజీ తరువాయి**

వలన జిల్లాలో పేదరికాన్ని పారద్రోలుటకు నాంది పలుకుతుందని చెప్పారు. జిల్లాలో ప్రత్యేకమైన వనరుగా తయారుకానుందని తెలిపారు. పోర్టు నిర్మాణానికి రాజకీయలకు అతీతంగా ప్రజలు అందరూ సహకరించాలని, క్రియాశీలక భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లా అభివృద్ధిపై ముఖ్య మంత్రి దృష్టి కేంద్రీకరించారని పేర్కొంటూ కిడ్నీ రిసెర్చ్ కేంద్రాన్ని మంజూరు చేసారని, ఉద్దానం ప్రాంతంలో ఇంటింటికి తాగు నీటిని సరఫరా చేయుటకు రూ.7 వందల కోట్లతో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని తద్వారా పోర్టు అవసరాలకు కావలసిన మానవ వనరులకు ఇబ్బందులు ఉండవని చెప్పారు.

రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి డా.సీదిరి అప్పల రాజు మాట్లాడుతూ భావనపాడు పోర్టు డిపిఆర్ ను రికార్డు స్థాయిలో తయారు చేయించి ఆమోదించడం జరిగిందన్నారు. గతంలో పోర్టు నిర్మాణానికి ప్రయత్నాలు జరిగాయని అయితే పూర్తి స్థాయిలో చిత్తశుద్ధిలేకపోయిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆలోచిస్తున్నారని తెలిపారు. భావనపాడు పోర్టు ద్వారా జిల్లా శరవేగంతో అభివృద్ధి చెందగలదని పేర్కొన్నారు. పోర్టు నిర్మాణానికి ప్రభుత్వ సంకల్పం మాత్రమే కాదని, ప్రజల సహకారం అవసరమని ఆయన కోరారు. పోర్టును మొత్తం 2,217 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఏపి మారిటైమ్ బోర్డు ఆధ్వర్యంలో మొదటి దశలో 5 వందల ఎకరాల్లో నిర్మాణం జరుగుతుందని తెలిపారు. మిగిలిన 1717 ఎకరాలను ఏపిఐఐసి ఆధ్వర్యంలో భూసేకరణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భూములు కోల్పోతున్న వారికి, నిర్వాసితులకు ప్రభుత్వం చట్టాలకు అనుగుణంగా మంచి ప్యాకేజి ఇవ్వడం జరుగుతుందని, ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మిస్తామని చెప్పారు. గ్రామాల్లో పర్యటన చేసి ప్రజలతో చర్చిస్తామని తెలిపారు. గ్రామస్తులలో ఎటువంటి ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భావనపాడులో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం ముఖ్య మంత్రి దృష్టిలో పెట్టామని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ జె నివాస్ మాట్లాడుతూ భావనపాడు పోర్టు ద్వారా జిల్లా మంచి అభివృద్ధి సాధిస్తుందన్నారు. విశాఖపట్నం పోర్టు వలన ఆ ప్రాంతం బాగా అభివృద్ధి చెందిన విషయం తెలిసిందేనని చెప్పారు. పోర్టును ల్యాండ్ లార్డ్ మోడల్ లో భావనపాడు పోర్టు అభివృద్ధి కార్పొరేషన్ (బిపిడిసిఎల్) నిర్మిస్తుందని చెప్పారు. బిపిడిసిఎల్ ను స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్.పి.వి) గా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. దేవునల్తాడ - భావనపాడు మధ్య పోర్టు నిర్మాణం జరుగుతుందని పేర్కొంటూ 1789 ఎకరాలు జిరాయితీ ఉండగా, 697 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. సి.ఆర్.జెడ్ భూములను అనుభవిస్తున్నవారికి భూమి బేసిక్ విలువను నష్టపరిహారం అందించడం జరుగుతుందని చెప్పారు. గ్రామాలన్ని ఆధునిక సాఫ్ట్ వేర్ తో సర్వే చేస్తామని చెప్పారు. ప్రాజెక్టు క్రింద నిర్వాసితుల కుటుంబాలకు కుటుంబ యజమానితోపాటు మేజర్ కుమారులకు కూడా ప్యాకేజి అందించడం జరుగుతుందని తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి క్రింద ఇంటి స్థలం లేదా నిర్మించిన ఇళ్ళు లేదా నగదు చెల్లించడం జరుగుతుందన్నారు. ఇంటి స్థలం వద్దు అనుకుంటే ఏకమొత్తంగా రూ.5 లక్షలు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఇళ్ళు ఖాళీ చేసే సమయంలో రవాణా ఛార్జీగా రూ.50 వేలు, పశువుల పాకలకు రూ.25 వేలు, చిరు వ్యాపారులకు వన్ టైమ్ సెటిల్ మెంట్ గా రూ. 50 వేలు అందించడం జరుగుతుందని చెప్పారు. భూమి ఆధారిత విలువను అన్ని గణించిన అనంతరం రూ.15 లక్షలుగా నిర్ణయించడం జరిగిందని వివరించారు.



ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, సబ్ కలెక్టర్ గనూర్ సూరజ్ ధనంజయ, జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.వి.శ్రీనివాస్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ టి.వేణుగోపాల్, సర్వే సహాయ సంచాలకులు ప్రభాకర్, పోర్టు ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.





## సత్యదేవుని దర్శన వేళలు మార్పు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు ది.07.09.2020వ తేది నుండి శ్రీ స్వామి దేవాలయము నకు భక్తులను యధావిధిగా ఉదయం 6.00 గంటల నుండి రాత్రి 9.00 గంటల వరకు స్వామివారి దర్శనమునకు అనుమతించబడును. మరియు భక్తులకు రూమ్స్ కొండపైన ఆదివారం అర్ధరాత్రి నుండి కేటాయించబడును.కావున భక్తులు,గ్రామస్థులు సదరు విషయమును గ్రహించవలసినదిగా ఈవో త్రినాధరావు కోరారు.

## *1.4లక్షల ఉద్యోగాలపై రైల్వేశాఖ కీలక ప్రకటన*

దిల్లీ: రైల్వేలో భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించాల్సిన పరీక్షలపై ఆ శాఖ కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా 1.40లక్షల ఉద్యోగాల నియామకానికి డిసెంబర్ 15 నుంచి పరీక్షల ప్రక్రియ ప్రారంభించనున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు రైల్వే బోర్డు ఛైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్ దిల్లీలో మీడియాతో మాట్లాడారు. మూడు విభాగాల్లో 1.4 లక్షల ఉద్యోగాల నియామకానికి దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందన్నారు. రైల్వేలో మూడు కేటగిరీల కింద 1,40,640 ఉద్యోగాల కోసం రైల్వేశాఖ రెండేళ్ల క్రితం నోటిఫికేషన్ ఇవ్వగా.. దాదాపు 2.4 కోట్ల మందికి పైగా దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, అభ్యర్థులందరికీ కంప్యూటర్ బేస్డ్ పరీక్ష (సీబీటీ) నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కరోనా నేపథ్యంలో ఆ పరీక్షలు వాయిదా పడ్డాయని వీకే యాదవ్ తెలిపారు. పూర్తి షెడ్యూల్‌ను అతి త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం జేఈఈ, నీట్ పరీక్షలు జరుగుతుండటంతో వాటి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని కరోనా వల్ల నిలిచిపోయిన ఈ పరీక్షలను కూడా ప్రారంభించాలని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. రైల్వేశాఖ గతంలో జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం నాన్ టెక్నికల్ పాపులారిటీ కేటగిరీ (ఎన్‌టీపీసీ) కింద గార్డులు, ఆఫీస్ క్లర్క్‌లు, కమర్షియల్ క్లర్క్‌ల పోస్టులు 35,208 కాగా.. మినిస్టీరియల్ కేటగిరీ ఉద్యోగాలైన స్టెనో తదితర ఉద్యోగాలు 1663బీ అలాగే, ట్రాక్ నిర్వహణ, పాయింట్‌మెన్ వంటి ఉద్యోగాలు 1,03,769లను భర్తీ చేయనున్నారు.

### ప్రధాన ఓడరేవులన్నీ ఇకనుంచి భారతదేశంలో నిర్మించిన

# టగ్ బోట్లను మాత్రమే ఉపయోగించుకోవాలి

### - కేంద్ర నౌకాయాన శాఖ నిర్ణయం



విశాఖపట్నం : భారతీయ నౌకా నిర్మాణ రంగ పునరుజ్జీవనాన్ని పెంచే దిశగా మరియు ఆత్మ నిర్భర్ భారత్ లోని ఆత్మ నిర్భర్ నౌకా నిర్మాణం వైపు నకాయాన శాఖ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇక మీదట భారతదేశంలో తయారుచేసే టగ్ బోట్లను మాత్రమే కొనుగోలు చేయాలనీ లేదా అద్దెకు తీసుకోవాలని, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అన్ని ప్రధాన ఓడరేవులను ఆదేశించింది. ప్రధాన ఓడరేవుల ద్వారా జరుగుతున్న కొనుగోలు లావాదేవీలన్నీ, ఇప్పుడు సవరించిన 'మేక్ ఇన్ ఇండియా' ఆదేశాల ప్రకారం చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ మేక్ ఇన్ ఇండియా ను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది మరియు 'మేక్ ఇన్ ఇండియా' షిప్ బిల్డింగ్ కోసం కొన్ని ప్రముఖ దేశాలతో చర్చలు జరిపింది. పాత నౌకా నిర్మాణ కేంద్రాలను పునరుద్ధరించడానికీ, దేశంలో ఓడల నిర్మాణాన్ని ప్రోత్సహించడానికీ ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని, కేంద్ర షిప్పింగ్ శాఖ సహాయ మంత్రి శ్రీ మన్సుఖ్ మాండవియా స్పష్టం చేశారు. భారతదేశంలో నౌకా నిర్మాణం, నౌకల మరమ్మత్తు, నౌకల పునర్వినియోగం మరియు ప్రారంభించడానికి తగిన పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆత్మ నిర్భర్ నౌకా నిర్మాణం రాబోయే కాలంలో బహుళ ప్రసిద్ధి చెందనుంది. భారతీయ నౌకాశ్రయాల సంఘం మేనేజింగ్ డైరెక్టర్ నేతృత్వంలో, కొచ్చిన్ షిప్ యార్డ్ లిమిటెడ్ (సి.ఎస్.ఎల్)బీ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్.సి.ఐ), ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ (ఐ.ఆర్.ఎస్) మరియు షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ ప్రతినిధులతో కూడిన ఒక స్థాయి సంఘాన్ని (స్టాండింగ్ స్పెసిఫికేషన్స్ కమిటీని) ఏర్పాటు చేయాలని కేంద్ర నౌకాయాన శాఖ ప్రతిపాదించడం జరిగింది. నిర్ణీత కొలమానాలను ఏర్పాటు చేసేందుకు కమిటీ సుమారు ఐదు రకాల టగ్ ల జాబితాను రూపొందించడంతో పాటు, 'ఆమోదించబడిన ప్రామాణిక టగ్ డిజైన్ మరియు స్పెసిఫికేషన్లను' (ఏ.ఎస్.టి.డి.ఎస్) ను సిద్ధం చేస్తుంది. లక్షణాలు, సాధారణ ఏర్పాట్లు, ప్రాథమిక లెక్కలు, ప్రాథమిక నిర్మాణ డ్రాయింగులు, కీలక విధాన పరమైన డ్రాయింగ్‌లు మరియు ఇతర నిర్మాణ ప్రమాణాలు మొదలైన వివరాలతో ఏ.ఎస్.టి.డి.ఎస్. ను సిద్ధం చేస్తారు. స్టాండింగ్ స్పెసిఫికేషన్స్ కమిటీ పరిశీలించిన ఈ ప్రమాణాలను, ఐ.ఆర్.ఎస్. 'సూత్ర ప్రాయంగా' ధృవీకరిస్తుంది. ఆ తర్వాత భారతీయ నౌకాశ్రయాల సంఘం తన వెబ్ సైట్ లో ప్రచురిస్తుంది.

మంత్రిత్వ శాఖ ఈ విషయంలో భారీ నౌకాశ్రయాలకు కూడా అవకాశం ఇస్తుంది.

తద్వారా నిర్మాణ సమయం కలిసి వస్తుంది. ఇటీవల, ప్రభుత్వ యాజమాన్యంలోని కొచ్చిన్ నౌకా నిర్మాణ సంస్థ, నార్వే ప్రభుత్వం నుండి రెండు ఆటోమేటెడ్ నౌకల నిర్మాణానికి ఆర్డర్‌ను పొందడంలో విజయవంతమైంది. ఈ రకమైన మానవరహిత నౌకలలో ఇవి మొదటివి. షిప్పింగ్ మంత్రిత్వ శాఖ తీసుకున్న వివిధ నిర్ణయాలు సమీప భవిష్యత్తులో నౌకా నిర్మాణ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయి.

# నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### - గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలనూ అందుబాటులోకి తేవాలి

### - క్షేత్ర స్థాయి పర్యటనలో జిల్లా కలెక్టర్ వి. వినయ్‌చంద్ అధికారులకు ఆదేశం



విశాఖపట్నం, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసురావాలని పంచాయితీరాజ్ ఎస్.ఇ. ని ఆదేశించారు. శనివారం అచ్యుతాపురం మండలంలో పర్యటించి హరిపాలెం గ్రామం, కొండకర్ల ఆవ, చీమలాపల్లి గ్రామాలను ఆయన సందర్శించి నాడు - నేడు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాల నిర్మాణాల పనులను ఆయన పరిశీలించారు. హరిపాలెం గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కన్న కలలకు దగ్గరగా గ్రామ సచివాలయం ఉందన్నారు. గ్రామ సచివాలయం భవనం వలె రైతు భరోసా కేంద్రంను నిర్మించాలని తెలిపారు. రైతు భరోసా కేంద్ర నిర్మాణం ఎన్ని రోజుల్లో పూర్తి చేసి అందుబాటులోకి వస్తుందని పంచాయితీ రాజ్ ఎస్.ఇ. సుధాకర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోజుకు ఎన్ని శ్యాంపిల్స్ తీస్తున్నారని, ఎన్ని కరోనా పాజిటివ్ కేసులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పి.హెచ్.సి.లో గల ల్యాబ్, ఫార్మశీని పరిశీలించారు. ఫార్మశీ లో గల మందుల వివరాలు, స్టాక్ ఎంత ఉన్నదీ, రిజిస్టర్ సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదాఅని రిజిస్టర్ను పరిశీలించారు. ల్యాబ్ ను పరిశీలించి అందులో కొన్ని పరికరాలు మరమ్మత్తులకు గురైనవని, అవసరమైన పరికరాల జాబితా పంపాలని డా. రజనిని ఆదేశించారు. పి.హెచ్.సి.లో ప్రసవాలు ఎన్ని జరిగాయని, సౌకర్యాలు అన్ని ఉన్నాయని, ప్రసవాలు తగ్గకూడదని డాక్టర్ ను ఆదేశించారు. పి.హెచ్.సి.లో లైటింగ్, పెయింటింగ్, తదితరమైనవి వారం రోజుల్లో రూపు రేఖలు మారిపోవాలని ఆదేశించారు.

ఆ బాధ్యతను అనకాపల్లి ఆర్డీఓ సీతారామరావుకు అప్పగించారు. కొండకర్ల ఆవ ను సందర్శించారు. పర్యాటకులు వస్తున్నది లేనిది తహసిల్దార్ ను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ఆహ్లాదంగా తయారు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పర్యాటకులు సందర్శించే విధంగా ఉండాలని, సైనేజస్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చీమలాపల్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను పరిశీలించారు. అక్కడ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ మీరంతా కరోనా-19 పై తగు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని పాజిటివ్ కేసులు వచ్చాయి, వారికి వైద్యం అందిస్తున్నారా లేదా, ప్రతీ రోజు వారి ఆరోగ్యం పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారా లేదా అని ఎ.ఎన్.ఎం.ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో చేపడుతున్న నాడు - నేడు పనులను పరిశీలించారు.

పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సర్వశిక్ష అభియాన్ పి.ఓ. మల్లిఖార్జునరెడ్డిని ఆదేశించారు. మరుగుదొడ్లను పరిశీలించి రన్నింగ్ వాటర్ నిత్యం ఉండే విధంగా చూడాలని, ప్రహరీ గోడ అంతటినీ పరిశీలించి చుట్టు ఉన్న చెత్త చెదారాన్ని తొలగించి పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని చెప్పారు.

ఈ పర్యటనలో అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి సీతారామారావు, పంచాయితీరాజ్ ఎస్.ఇ. సుధాకర్ రెడ్డి, ఎస్.ఎస్.ఎ. పిఓ మల్లిఖార్జున రెడ్డి, తహసిల్దార్ నారాయణరావు, ఎంపిడిఓ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి తండ్రి తరువాత గురువే దైవం

### - వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### - ముఖ్యఅతిథిగా హాజరైన సజ్జల రామకృష్ణారెడ్డి



తాడేపల్లి : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంత్రులు, పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు కురసాల కన్నబాబు, శంకర్ నారాయణ, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకుడు లేళ్ల అప్పిరెడ్డి, పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భావి భారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులందరికి పార్టీ తరుపున, వ్యక్తిగతంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.. - గురువు లేని విద్య ఉండదు, గురువు లేకుండా ఎవరూ పెద్దవారు కాలేరు. అలాగే గురువు లేని జీవితం సాగదు.. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి తండ్రి తరువాత అతి ముఖ్యమైన వ్యక్తి గురువు. ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వాములుగా ఉంటారు. గురువులను గౌరవించుకోవడం, పూజించుకోవడం అన్నది మన జీవన విధానంలోనే ఒక భాగం. ఉపాధ్యాయులంటే.. కేవలం ఉద్యోగులగా ట్రీట్ చేస్తున్న విధానం నుంచి.. ఈ రోజు జగన్ మోహన్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ వృత్తికి ఒక సువర్ణయుగం మొదలైందని చెప్పక తప్పదు. - మనమందరం చిన్నప్పుడు చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలన్నీ నాడు-నేడు కార్యక్రమం ద్వారా సరికొత్త హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. ప్రభుత్వ స్కూళ్ళకు నేడు సువర్ణయుగం మొదలైంది. -ఇంతకాలం అప్పులు చేసి మరీ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంగ్లీషు మీడియం చదువులు కోసం ప్రైవేటు స్కూళ్ళను ఆశ్రయించి.. వేలకు వేలు ఫీజులు కడుతూ అనేక ఇబ్బందులు పడుతున్న దశ నుంచి.. నేడు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇంగ్లీషు మీడియం చదువులు తెచ్చిన పరిస్థితి. జగన్ మోహన్ రెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన తరువాత విద్య, వైద్యం మీద ఏ విధంగా ఫోకస్ పెట్టారో అనే విషయం అందరూ గమనించే ఉంటారు. 95శాతం తల్లిదండ్రులు, మా పిల్లల భవిష్యత్తుకు ఇంగ్లీషు మీడియం కావాలి, వారు విశ్వమానవులుగా ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా నేటి పోటీ ప్రపంచంలో పోటిపడగలగాలని పేరెంట్స్ కోరుకున్న తరువాత ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం, దానితో పాటు ఉపాధ్యాయులకు ఆత్మవిశ్వాసం పెరిగేలా వారికి ట్రైనింగ్ ఇప్పించడం ఈ ప్రభుత్వ హయాంలోనే జరుగుతోంది. ఈరోజు బతకలేక బడిపంతులు అనే స్థాయి నుంచి బతుకునిచ్చే బడిపంతులు అనే విధంగా, అలాగే వీరికి సంబంధించిన సమస్యలు పరిష్కరించడమే కాకుండా, ఈ వృత్తికి గౌరవాన్ని, పూర్వవైభవం తీసుకొచ్చిన ఘనత జగన్ మోహన్ రెడ్డిగారికి దక్కుతుంది. అలాగే పేద విద్యార్థులకు యూనిఫామ్ ల దగ్గర నుంచి అన్నీ నేడు సిద్ధంగా ఉన్నాయి. మన ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ ఇయర్ మొదలవగానే స్కూల్ కి వెళ్తే .. ఇంతవరకూ ఎక్కడో విదేశాల్లో మాత్రమే కనిపించే విధంగా.. మన పాఠశాలలు కూడా అలానే అద్భుతంగా ఉండబోతున్నాయి. మహనీయులు కన్న కలలను నిజం చేస్తూ.. విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉండాలి, భావి భారత పౌరులుగా వారిని ఎలా తీర్చిదిద్దాలో.. అన్నది జగన్ మోహన్ రెడ్డిగారు ఈరోజు ఆచరణలో చేసి చూపెడుతన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు సగర్వంగా తలెత్తి విద్యార్థుల భవిష్యత్తును మేము తీర్చుదిద్దుతున్నామనే పరిస్థితి ఆంధ్రప్రదేశ్ లో ఉంది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు శంకర నారాయణ, వెల్లంపల్లి, కన్నబాబు, ఎమ్మెల్యే సుధాకర్ బాబు, లేళ్ళ అప్పిరెడ్డి, వెన్నపూస గోపాల్ రెడ్డి, వాసిరెడ్డి పద్మ, పద్మజ, నారాయణ మూర్తి, ఈదా రాజశేఖర్ రెడ్డి, వైస్సార్ టీచర్స్ పెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాలి రెడ్డి.. ఉపాధ్యాయ దినోత్సవంను పురష్కరించుకుని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీతలు వి. రామ్మోహన్ రావు గారిని, శ్రీమన్నారాయణ గారిని, అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్ నవీన్ కుమార్ గారిని ఘనంగా సత్కరించారు. మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శ్రీమతి వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాలరెడ్డి, అధికార ప్రతినిధులు నారమల్లి పద్మజ, ఈదా రాజశేఖర్,నారాయణ మూర్తి, టీచర్స్ ఫెడరేషన్స్ నాయకుడు జాలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు కాన్వాయ్‌లో ప్రమాదం

చౌటుప్పల్ గ్రామీణం: తెదేపా అధినేత చంద్రబాబు కాన్వాయ్‌లోని వాహనం ప్రమాదానికి గురైంది. ఆవు అడ్డురావడంతో ఎస్కార్ట్ వాహనం డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో కాన్వాయ్‌లోని జామర్ వాహనాన్ని ఎన్ఎస్‌జీ2 వాహనం ఢీ కొట్టింది. ఆ తర్వాతి వాహనంలోనే ఉన్న చంద్రబాబు క్షేమంగా ఉన్నారు. ఎన్ఎస్‌జీ వాహనం మొరాయించడంతో 15 నిమిషాలపాటు ఆయన రోడ్డుపైనే ఆగిపోయారు. అనంతరం స్పేర్ వాహనంలో సిబ్బంది ఎక్కారు. విజయవాడ నుంచి చంద్రబాబు హైదరాబాద్ వెళ్తుండగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది.



## ఏపీలో వరుసగా 10వరోజు 10వేలకు పైగా కేసులు

అమరావతి : ఏపీలో కరోనా విజృంభణ కొనసాగుతోంది. వరుసగా పదోరోజు కూడా పదివేలకు పైగా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 69,623 శాంపిల్స్‌ని పరీక్షించగా 10,825 మందికి కరోనా నిర్ధారణ అయ్యింది. దీంతో ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 4,87,331కి చేరింది. తాజాగా 71 మంది ప్రాణాలు కోల్పోగా మృతుల సంఖ్య 4347కి చేరింది. ఇవాళ 11,941 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం బులిటెన్ విడుదల చేసింది.

### అన్ని దానాలలో కంటే

# విద్యాదానం గొప్పది

### ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్



శ్రీకాకుళం : డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణదాస్, రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి డా.సీదిరి అప్పల రాజు హాజరై డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ అన్ని దానాలలో కంటే విద్యాదానం గొప్పదని కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి, దివంగత డాక్టర్ సర్వేపల్లి విద్యారంగానికి చేసిన కృషికి ఫలితంగా ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని మంత్రి గుర్తుచేసారు. గురువులను పూజించడం మన సంప్రదాయమని, విద్యార్థులకు జ్ఞానం ఇవ్వడం ఉపాధ్యాయుల ధర్మమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు మధు బాబు, ఇతర ఉత్తమ ఉపాధ్యాయులను మంత్రులు అభినందించారు.

**మధుబాబుకి సత్కారం:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్రపతి అవార్డు స్వీకరించిన కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయులు ఏ. మధు బాబును శాలువాతో ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ సన్మానించారు. ఈసారి రాష్ట్రం నుంచి జాతీయ అవార్డుకు ఎంపికైన ఏకైక ఉపాధ్యాయునిగా మధుబాబు నిలవడం పట్ల మంత్రి మధుబాబుకు అభినందనలు తెలియజేసారు. మధుబాబు జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింప చేసారని కితాబిచ్చారు.

ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సుమిత్ కుమార్, సబ్ కలెక్టర్ గనూర్ సూరజ్ ధనుంజయ, జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, జిల్లా విద్యాశాఖాధికారి కె.చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com